www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 207 | శుక్రవారం | 24 జులై, 2026



## పార్లమెంటులో ప్రతిష్టంభన

### నీట్ లీక్‌పై చర్చకు కుదరని ఏకాభిప్రాయం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని విపక్షాల పట్టు
- ఉభయసభలు నేటికి వాయిదా

నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనతో పార్లమెంట్ ఉభయసభల్లో గురువారం కూడా కార్యకలాపాలు సజావుగా సాగలేదు. చర్చ నిర్వహించే విధానంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో లోక్‌సభ, రాజ్యసభలు పలుమార్లు వాయిదా పడి చివరకు నేటికి వాయిదా వేశారు. సభ ప్రారంభమైన వెంటనే నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రభుత్వం బాధ్యత వహించాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని పట్టుబట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో లోక్‌సభను పలుమార్లు వాయిదా వేసిన అనంతరం నేటికి వాయిదా వేయగా, రాజ్యసభను కూడా సమావేశాలు కొనసాగించలేక వాయిదా వేశారు.

2

### ప్రశ్నాపత్రాల లీక్‌లపై
## కఠిన చట్టం



- వచ్చే వారం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడతాం
- నేడు కేంద్ర మంత్రివర్గంలో చర్చ
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో వేగంగా విచారణ
- ప్రధాని నరేంద్ర మోదీ

2



## 26 రోజుల దీక్షకు ముగింపు

- కేంద్ర ప్రభుత్వ హామీలతో ఆమరణ నిరాహార దీక్ష విరమించిన సోనమ్ వాంగ్‌చుక్
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకూ జంతర్‌మంతర్‌లో సీజేపీ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం

2



### నీట్‌పై రాజకీయాలు

- ప్రశ్నపత్రాల లీక్‌లపై గతంలో కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా?
- దోషులపై చర్యలు తీసుకున్నాం
- విద్యార్థుల ప్రయోజనాలే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు

2

## గ్లోబరీనా కేటీఆర్ బినామీనే



### ఆ సంస్థ తప్పిదాలతో 27మంది బలి

- పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందింది
- ఈ తప్పిదాలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి
- ధర్మేంద్ర రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు
- బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒక్కటే
- ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- ఓటు లేకపోతే పథకాలు పోతాయి
- మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** గ్లోబరీనా సంస్థ ముమ్మాటికీ కేటీఆర్‌కు బినామీ సంస్థేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఆరోపించారు. గతంలో ఆ సంస్థ చేసిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, అనంతరం పేరు మార్చుకుని మళ్లీ పరీక్షల నిర్వహణ కాంట్రాక్టులు పొందిందని విమర్శించారు. గ్లోబరీనా వ్యవహారంపై కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గ్లోబరీనా సంస్థకు సంబంధించిన అంశాల ఆధారంగానే నీట్ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. కేటీఆర్ జన్మదినంపై స్పందిస్తూ, 'దావత్ ఇస్తాడో అడగాలి. అయితే ఆయన ఇచ్చే దావత్‌ను నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు గొప్ప నాయకుడైతే ఆయనను మంత్రి పదవి నుంచి తరువాయి 2లో..

## ముఖ్యమంత్రి ఆరోపణలు నిరాధారం

- రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలి
- లేదంటే న్యాయపరమైన తీసుకుంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ప్రజానావ, హైదరాబాద్:** గ్లోబరీనా సంస్థపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. 2019 ఇంటర్ ఫలితాల్లో గ్లోబరీనా సంస్థ అవకతవకలకు పాల్పడిందని, ఆ సంస్థకు తనతో సంబంధం ఉందంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో కేటీఆర్ మాట్లాడుతూ, పేపర్ లీక్ వంటి అత్యంత దురదృష్టకర ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం దురదృష్టకరమని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేయడం ముఖ్యమంత్రి పదవికే మచ్చ తెచ్చే చర్యగా అభివర్ణించారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్ఎస్‌కు, తన కుటుంబానికి లేదా తనకు ఎలాంటి సంబంధం లేదని మరోసారి స్పష్టం చేసిన కేటీఆర్, ఈ విషయంలో ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనికి సంబంధించి తమ న్యాయ బృందం త్వరలోనే ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపనున్నట్లు వెల్లడించారు. తనపై ముఖ్యమంత్రి తరచూ అసభ్యకరమైన, ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు వాటిపై పెద్దగా స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తన మౌనాన్ని ఆరోపణలను అంగీకరించినట్లు భావించవద్దని, నిరాధార విమర్శల స్థాయికి దిగజారి రాజకీయ వాదన చేయడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు.

### దమ్ముంటే నీట్‌పై చర్చకు రావాలి

- యువత భవిష్యత్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధం
- విపక్షాలకు బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్
- పారిపోతోందంటూ కాంగ్రెస్‌పై విమర్శలు

6



### బీఆర్ఎస్‌కు ఎందుకంత
## కడుపుమంట

- మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా?
- డబుల్ బెడ్‌రూం ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది
- ఆ పార్టీ పదేళ్ల చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే విషప్రచారమా?
- రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?
- ఇండ్ల కేటాయింపులో బడుగు, బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




2



2

### విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసింది బీజేపీ

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే
- మోదీ ట్వీట్‌పై రాహుల్, అభిజిత్ దీప్కే విమర్శలు

# పార్లమెంటులో ప్రతిష్టంభన

- నీట్ లీక్‌పై చర్చకు కుదరని ఏకాభిప్రాయం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని విపక్షాల పట్టు
- ఉభయసభలు నేటికి వాయిదా



**న్యూఢిల్లీ:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనతో పార్లమెంట్ ఉభయసభల్లో గురువారం కూడా కార్యకలాపాలు సజావుగా సాగలేదు. చర్చ నిర్వహించే విధానంపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో లోక్‌సభ, రాజ్యసభలు పలుమార్లు వాయిదా పడి చివరకు నేటికి వాయిదా వేశారు. సభ ప్రారంభమైన వెంటనే నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రభుత్వం బాధ్యత వహించాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని పట్టుబట్టడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో లోక్‌సభను పలుమార్లు వాయిదా వేసిన అనంతరం నేటికి వాయిదా వేయగా, రాజ్యసభను కూడా సమావేశాలు కొనసాగించలేక వాయిదా వేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాతే ఈ అంశంపై చర్చకు తమ పార్టీ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. నీట్ అంశంపై రూల్ 267 కింద చర్చ చేపట్టాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం అంగీకరించడం లేదని ఆరోపించారు.

రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహ రిం చిన తీరుపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాద వ్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీక్ జరిగిన విష యాన్ని ప్రభుత్వం అంగీకరిస్తే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### తప్పించుకునేందుకే షరతులు

మరోవైపు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్షాల తీరును తప్పుబట్టారు. నీట్ అంశంపై చర్చ నుంచి తప్పించుకునేందుకే ప్రతిపక్షాలు ముందస్తు షరతులు పెడుతున్నాయని ఆరోపించారు. చర్చకు ముందు రాజీనామా వంటి షరతులు విధించడం సరికాదని, ఈ అంశంపై ప్రభుత్వానికీ తన వాదన వినిపించే హక్కు ఉందని స్పష్టం చేశారు. ఇదిలాఉండగా, పార్లమెంట్ వెలుపల కూడా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నిరసనలు కొనసాగాయి. ఒకవైపు కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా, మరోవైపు ఎన్డీయే సభ్యులు ప్రతిపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో పార్లమెంట్ ప్రాంగణం మొత్తం రాజకీయ నినాదాలతో మార్మోగింది.

# ప్రశ్నాపత్రాల లీక్‌లపై కఠిన చట్టం

- వచ్చే వారం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడతాం
- ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ:** ప్రశ్నాపత్రాల లీక్‌లను అరికట్టేందుకు కఠిన నిబంధనలతో కూడిన కొత్త బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ బిల్లులో పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక నిబంధనలు ఉంటాయని తెలిపారు. గురువారం విడుదల చేసిన వీడియో సందేశంలో ప్రధాని మాట్లాడుతూ, శుక్రవారం జరిగే కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రశ్నాపత్రాల లీక్‌ల అంశంపై సమగ్రంగా చర్చిస్తామని చెప్పారు. మంత్రివర్గ సహచరుల సూచనలు తీసుకున్న అనంతరం బిల్లు తుది రూపు దాల్చుతుందని వెల్లడించారు. వచ్చే సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల రెండో వారంలో ఈ బిల్లును సభ ముందుకు తీసుకొస్తామని, వీలైనంత త్వరగా ఆమోదం పొందేలా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల లీక్‌లు చిన్న విషయం కాదని, లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇది తీవ్ర వేదన కలిగించే అంశమని ప్రధాని అన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన గత రెండున్నర నెలలుగా ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపట్టిందని వివరించారు.

### దోషులు జైలులోనే ఉన్నారు

పేపర్ లీక్‌కు పాల్పడిన నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపినట్లు ప్రధాని తెలిపారు. విద్యార్థులు ఒక విద్యాసంవత్సరం కోల్పోకుండా చూడడం ప్రభుత్వ తొలి బాధ్యతగా భావించామని చెప్పారు. అందుకే అన్ని వనరులను వినియోగించి వెంటనే మళ్లీ పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు రీ-టెస్ట్‌కు హాజరయ్యేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. జూలై 19న ఫలితాలు ప్రకటించగా, విజయవంతమైన విద్యార్థుల నుంచి సంతోషకర స్పందనలు వస్తున్నాయని అన్నారు. రీ-టెస్ట్ నిర్వహించడంతోనే ప్రభుత్వం సంతృప్తి చెందదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీక్ కేసుల విచారణ వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ మేరకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసే ప్రక్రియ ప్రారంభమైనట్లు వెల్లడించారు.

# 26 రోజుల దీక్షకు ముగింపు

- కేంద్రం హామీలతో ఆమరణ నిరాహార దీక్ష విరమించిన సోనమ్ వాంగ్‌చుక్

**న్యూఢిల్లీ:** సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ 26 రోజులుగా కొనసాగిస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలతో ముగింపు పలికారు. గురుగ్రామ్‌లోని మెడాంతా ఆస్పత్రిలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, డాక్టర్ జితేంద్ర సింగ్‌తో జరిగిన చర్చల అనంతరం శుక్రవారం అర్ధరాత్రి దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. అయితే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు జంతర్‌మంతర్‌లో తమ శాంతియుత ఆందోళన కొనసాగుతుందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) స్పష్టం చేసింది. మెడాంతా ఆస్పత్రిలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, డాక్టర్ జితేంద్ర సింగ్ సోనం వాంగ్‌చుక్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వ తరపున పలు హామీలు ఇచ్చారు. అనంతరం లేహ్-లడఖ్ అపెక్స్ బాడీ నాయకుల సమక్షంలో 26 రోజుల దీక్షను విరమించినట్లు వాంగ్‌చుక్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. దేశంలో హింసాత్మక పరిస్థితులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో, సుదీర్ఘ చర్చల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

### ప్రధాని మోదీ స్పందన

వాంగ్‌చుక్ దీక్ష విరమించిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో స్పందించారు. వైద్యులు సూచించిన విధంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, త్వరగా కోలుకుని సాధారణ జీవనశైలికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. వాంగ్‌చుక్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 65 మంది ఎంపీలు తన దీక్ష విరమించాలని కోరినట్లు వాంగ్‌చుక్ వెల్లడించారు. దేశంలో ఎక్కడా హింసకు అవకాశం ఇవ్వకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తన నిర్ణయానికి దారితీసిన పరిస్థితులను త్వరలో ప్రత్యేక వీడియో ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. వాంగ్‌చుక్ దీక్ష విరమించడాన్ని స్వాగతించిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, ఆయన చేసిన త్యాగం దేశ మనస్సాక్షిని మేల్కొల్పిందని కొనియాడారు. అయినప్పటికీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు జంతర్‌మంతర్‌లో పార్టీ శాంతియుత ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీజేపీ ప్రధాన డిమాండ్లలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, పోటీ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై పూర్తి బాధ్యత నిర్ధారణ, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు, నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం, ఉద్యమంలో పాల్గొన్న శాంతి యుత నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లు, ఇతర న్యాయపరమైన చర్యలను ఉపసంహరించుకోవడం ఉన్నాయి.

### 11 కిలోల బరువు తగ్గిన వాంగ్‌చుక్

జూన్ 28న జంతర్‌మంతర్‌లో సీజేపీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉద్యమానికి సోనం వాంగ్‌చుక్ మద్దతు ప్రకటించి ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. పోటీ పరీక్షల్లో అక్రమాలపై బాధ్యత నిర్ధారణ, విద్యా సంస్కరణలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా వంటి డిమాండ్లతో ఆయన ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ 26 రోజుల దీక్షలో సుమారు 11 కిలోల బరువు కోల్పోయారు. జూలై 18న ఢిల్లీ పోలీసులు ఆయనను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించగా, తన భర్తను బలవంతంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచుతున్నారని ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు గురుగ్రామ్‌లోని మెడాంతా ఆస్పత్రికి తరలించగా, అక్కడే దీక్ష కొనసాగించిన వాంగ్‌చుక్ చివరకు కేంద్రం హామీల నేపథ్యంలో నిరాహార దీక్షను విరమించారు.

# నేడు దేశవ్యాప్త ఆందోళనకే సీజేపీ పిలుపు

- శాంతియుతంగా నిరసనలు తెలపాలని సూచన

**న్యూఢిల్లీ:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారానికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇటీవల జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు చేపట్టిన ర్యాలీ సందర్భంగా విద్యార్థులు, యువతపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పార్టీ వెల్లడించింది. నిరసన కార్యక్రమాలకు అవసరమైన అనుమతులు ముందుగానే తీసుకోవాలని, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు పరస్పర సమన్వయంతో ఏర్పాట్లు చేసుకోవాలని సీజేపీ సూచించింది. అన్ని ఆందోళనలు పూర్తిగా శాంతియుతంగా నిర్వహించాలని పార్టీ స్పష్టం చేసింది. నీట్ పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వం చర్చకు సిద్ధమని ప్రకటించిన నేపథ్యంలో సీజేపీ మరోసారి దేశవ్యాప్త నిరసనలకు పిలుపునివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. తమ డిమాండ్లను ప్రజలకు వివరించాలని, బాధిత విద్యార్థులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు మాత్రమే చేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించింది.

### రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు

నిరసనల్లో ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని, అనుమతి పొందిన ప్రాంతాల్లోనే కార్యక్రమాలు నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీజేపీ విజ్ఞప్తి చేసింది. ఎలాంటి ప్రేరేపణలకు స్పందించకుండా సంయమనంతో వ్యవహరించాలని కూడా సూచించింది. ఇదిలా ఉండగా, నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై విచారణ వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు, సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. నిరసనల ప్రభావం ఎక్కువగా ఉండే కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో గురువారం సాయంత్రం 6.30 గంటల నుంచి దుకాణాలు, కార్యాలయాలను మూసివేయాలని వ్యాపారులకు సూచించింది. ఎన్‌డీటీఏ నిర్ణయాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్ వేదికగా ప్రస్తావిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. సాయంత్రం నుంచే దుకాణాలు మూసివేయాలని సూచించడం, జంతర్‌మంతర్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించడం చూస్తుంటే ఆందోళన చేస్తున్న విద్యార్థులపై మరోసారి బలప్రయోగానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు.

### ఆందోళనలపై పోలీసుల దృష్టి

కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళనల సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. హింసలో పాల్గొన్నట్లు గుర్తించిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే వారి పాస్‌పోర్టులను కూడా రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నిరసనల సందర్భంగా జరిగిన ఘటనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఫొటోలు, ఇతర డిజిటల్ ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. వాటి ఆధారంగా హింసలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిసింది. నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, విద్యా వ్యవస్థలో జరిగిన అవకతవకలకు నిరసనగా సీజేపీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తోంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయగా, కొందరు నిరసనకారులు రాళ్లు రువ్వినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లతో పాటు ఆరుగురు పోలీసు సిబ్బంది గాయపడినట్లు వెల్లడించారు. ఈ పరిణామాల నేపథ్యంలో హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. డిజిటల్ ఆధారాల పరిశీలన పూర్తయిన చర్యలు వేగవంతం అ య్యే అవకాశం ఉంది.

# విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసిందే బీజేపీ



**న్యూఢిల్లీ:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ప్రకటించారు. అయితే ప్రధాని వ్యాఖ్యలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే తీవ్రంగా స్పందించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఆరోపించారు. రాహుల్ గాంధీ స్పందిస్తూ, నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలతో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు ప్రభావితమయ్యాయని అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు క్షమాపణ చెప్పడంతో పాటు ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే కూడా ప్రధాని ప్రకటనపై స్పందిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. నిరసన చేపట్టిన విద్యార్థులపై విచక్షణారహితంగా వ్యవహరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అభిజిత్ దీప్కే స్పష్టం చేశారు.

# నీట్‌పై రాజకీయాలు

- ప్రశ్నపత్రాల లీక్‌లపై గతంలో కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా?
- దోషులపై చర్యలు తీసుకున్నాం
- విద్యార్థుల ప్రయోజనాలే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- కేంద్ర మంత్రి మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు

**న్యూఢిల్లీ:** నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారాన్ని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్రలో భాగంగానే ఈ ఆందోళనలను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. గురువారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్‌రెడ్డి, జంతర్‌మంతర్‌తో పాటు పలు రాష్ట్రాల్లో జరుగుతున్న నిరసనలను ప్రస్తావిస్తూ ఇవి రాజకీయ ప్రేరేపితమైనవిగా కనిపిస్తున్నాయని అన్నారు. గతంలో షాహీన్‌బాగ్ ఆందోళనల్లో పాల్గొన్న శక్తులే ఇప్పుడు కూడా చురుకుగా ఉన్నట్లు అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రశ్నపత్రాల లీక్ ఘటనలో ప్రమేయం ఉన్న వారిని ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపామని, విద్యార్థులకు నష్టం జరగకుండా మరోసారి నీట్ పరీక్ష నిర్వహించామని తెలిపారు. ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు 2024లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా కేసుల విచారణను వేగవంతం చేసి దోషులకు కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ప్రకటించారని చెప్పారు.



ప్రశ్నపత్రాల లీక్‌లపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ, యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయని, అప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎవరైనా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు. అలాంటి చరిత్ర ఉన్న కాంగ్రెస్‌కు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని అన్నారు.

### ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం

రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు తమ పాలనలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి ప్రశ్నపత్రాల లీక్ జరిగినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నించారు. ప్రధాని నివాసం ముందు ధర్నాలు నిర్వహిస్తూ రాజకీయ నాటకాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించిన కిషన్‌రెడ్డి, విద్యార్థుల సంక్షేమంపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. తెలంగాణలో చలో రాజ్‌భవన్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దోషులను ఉపేక్షించే ప్రసక్తే లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# గ్లోబరీనా కేటీఆర్ బినామీనే

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు తొలగించారని ప్రశ్నించిన సీఎం, అతిగా మాట్లాడితే ప్రజలు నమ్మరని అన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ గురించి మాట్లాడే బీఆర్ఎస్ నేతలు మేడిగడ్డ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ నిర్మాణం, దాని లోపాలకు పూర్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆరోపించారు.

### ఎమ్మెల్యేలు గ్రామాల్లోనే ఉండాలి

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తయ్యే వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లోనే ఉండాలని సూచించినట్లు సీఎం తెలిపారు. ఎస్ఐఆర్ రాజకీయ నాయకులది కాకుండా ప్రజలకు సంబంధించిన ప్రక్రియ అని స్పష్టం చేశారు. బీజేపీ కుట్రపూరితంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేమితో అమాయకుల ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఓటు హక్కు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు దక్కవు. ప్రజల గుర్తింపుకే ఇబ్బంది కలుగుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పకుండా ధ్రువీకరించుకోవాలి అని రేవంత్‌రెడ్డి సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కుట్రలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియ 70 శాతం పూర్తయిందని, ఎక్కడా ఓట్లు అన్యాయంగా తొలగించకుండా బీఎల్‌వోలను నియమించామని తెలిపారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్ల తొలగింపు విషయంలో కాంగ్రెస్ కోర్టును ఆశ్రయించగా, అప్పటి కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు.

### పేదల ఇళ్లను దళారులకు అమ్ముకున్నారు

హైడ్రా సమర్థంగా పనిచేస్తోందని, ఇప్పటికే భారీగా ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుందని సీఎం తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతను పూర్తిగా విస్మరించారని, అవినీతి ఆరోపణల కారణంగానే గతంలో హరీశ్‌రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా పెట్టారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్ణయించిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదల ఇళ్లను దళారులకు అమ్ముకున్నారని ఆరోపించారు. జన్వాడ ఫామ్‌హౌస్ భూములపై కేటీఆర్ స్వయంగా విచారణ కోరాలని సవాల్ విసిరారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరాపార్క్ వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ప్రారంభించామని, ఒకప్పుడు దానిని మూసివేసిన వారే ఇప్పుడు అక్కడ ధర్నాలు చేస్తామని చెప్పడం విడ్డూరమని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

### నాణ్యతలో రాజీ ఉండొద్దు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫాంల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. యూనిఫాంల పంపిణీలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల యూనిఫాంల సరఫరాపై గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల యూనిఫాంలను త్వరితగతిన సరఫరా చేసేలా సంబంధిత సంస్థలపై ఒత్తిడి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి యూనిఫాం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

# బీఆర్ఎస్‌కు ఎందుకంత కడుపుమంట

**ప్రజానావ, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే వారికి సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. గురువారం సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం సమీప మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే మీ సేవ వాట్సాప్ నంబర్ 8096958096, వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. పదేళ్ల పాలనలో చేయలేని పనిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. <

అధికారంలో ఉన్న సమయంలో హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను బీఆర్ ఎస్ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. నగరంలో పుట్టి పెరిగిన నిరుపేద కుటుంబాలను ఉద్యోగాలు, ఉపాధి, విద్య, వైద్య సౌకర్యాలకు దూరంగా 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలోకి తరలించి, కనీస వసతులు లేకుండా అరకొరగా ఇళ్లు నిర్మించి అదే సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రజా ప్రభుత్వం మాత్రం పేదలు కూడా హైదరాబాద్ నగరంలోనే గౌరవంగా జీవిం చాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిం దని చెప్పారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆర్ఎస్ విషప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు.

### పేదల పేరుతో రాజకీయాలు దుర్మార్గం

పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలోని విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? ప్రభుత్వ భూములు కొద్దిమందికే పరిమితమా? పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంట? అంటూ మంత్రి ప్రశ్నించారు. పేదల పేరుతో రాజకీయాలు చేయడం అత్యంత దుర్మార్గమని, బీఆర్ఎస్ చేస్తున్న విషప్రచారాన్ని హైదరాబాద్ ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సొంత ఇల్లు లేని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో నాణ్యమైన గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇందిరమ్మ టవర్స్‌గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తోందని చెప్పారు. ఇది అమ్మకం కాదని, ప్రభుత్వ ఆర్థిక సహకారమని స్పష్టం చేశారు. లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే ఉంటుందని తెలిపారు. తొలి విడతలో ప్రారంభించే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు.

### ఇందిరమ్మ టవర్స్‌లో 30 శాతం మహిళలకు..

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తొలి విడతగా నిర్మించే ఇందిరమ్మ టవర్స్‌లో యాజమాన్య హక్కుల కేటాయింపులో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ రిజర్వేషన్లలో 30 శాతం మహిళలకు కేటాయిస్తామని, మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరీలో కేటాయిస్తామని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలపై బీఆర్ఎస్‌కు నిజంగా ప్రేమ, అభిమానం ఉంటే విషప్రచారాన్ని మానుకోవాలని మంత్రి హితవు పలికారు. ఇదే తీరును కొనసాగిస్తే జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఎదురైన ఫలితాలే రాష్ట్రవ్యాప్తంగా కూడా ఎదురవుతాయని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.





# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శంకుస్థాపన

**రూ.5.61 కోట్ల అంచనా వ్యయంతో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ పనులు**

**ప్రజానావ, రామగుండం:** ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల్లో రూ.561 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం న్యూ పోరట్‌పల్లిలో శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో 2, 32, 33, 34, 49 డివిజన్లలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, వర్షపు నీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, వర్షాకాలంలో నీరు నిలిచిపోయే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ ప్రభావిత ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రతి డివిజన్‌లో నాణ్యమైన రహదారులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థలు, వర్షపు నీటి పారుదల సౌకర్యాలను కల్పించి ప్రజలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి పర్యవేక్షణతో ప్రభుత్వ సేవల్లో జవాబుదారీతనం రావాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రాథమిక నైపుణ్యాలు అందించాలి
- అంగన్‌వాడీలు, సంక్షేమ హాస్టళ్లు, పీహెచ్‌సీలలో సేవల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- భూముల రీ సర్వేను ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించాలి
- రెవెన్యూ శాఖలో పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి
- పెద్దపల్లి, ధర్మారం, జూలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్



ప్రజానావ, పెద్దపల్లి : ప్రభుత్వ శాఖల పనితీరు క్షేత్రస్థాయిలో మెరుగుపడి ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం పెద్దపల్లి, ధర్మారం, జూలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్ ఎంపీపీఎస్ పాఠశాల, ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలికల హాస్టల్ సముదాయం, పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి ఎం.పీ.పీ.ఎస్, జడ్పీ.హెచ్.ఎస్, అంగన్‌వాడీ కేంద్రం, రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాగినేడు జడ్పీ.హెచ్.ఎస్, బొంపల్లి జడ్పీ.హెచ్.ఎస్ ప్రాథమిక పాఠశాల, ధర్మారం మండలంలోని పైడి చింతలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే, జూలపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి అదనపు బోధన అందించాలని, విద్యా ప్రమాణాల పెంపే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సమీకృత సంక్షేమ బాలికల హాస్టల్ సముదాయాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులకు అందుతున్న ఆహారం, వసతి, పరిశుభ్రత, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. హాస్టళ్లలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు నాణ్యతతో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎదుగుదల, పోషకాహార పంపిణీని పరిశీలించిన కలెక్టర్ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు తదితర ఆహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి పనితీరును మెరుగుపర చాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి సాధ్యమైనంత ఎక్కువ వైద్య సేవలను స్థానికంగానే అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దపల్లి మండలం బొం పల్లి గ్రామంలోని జడ్పీ.హెచ్.ఎస్ ప్రాథమిక పాఠశా లను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు వివరాలు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఉదయం పాఠశాల లో అందిస్తున్న రాగి జావా నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ధర్మారం మండలంలోని పైడి చింతలపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వేను పరిశీలించిన కలెక్టర్ రీ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామసభల ద్వారా రైతులకు రీ సర్వే ప్రయోజనాలను వివరించి ప్రజల పూర్తి సహకారంతో ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. జూలపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఇతర పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు జాప్యం లేకుండా పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడం ప్రతి అధికారికి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మండల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో నీట్ ఉదంతంపై కాంగ్రెస్ నిరసన

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నీట్ పరీక్షల వ్యవహారం, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జీని నిరసిస్తూ సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ చేపట్టిన కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గారి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు మాట్లాడుతూ, నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన వంశీ అనే యువకుడు తన ఆత్మహత్యకు సంబంధించి రాసిన సూసైడ్ నోట్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పేరును ప్రస్తావించిన అంశంపై సమగ్ర దర్యాప్తు జరిపి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నీట్ పరీక్షల వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆడెపు చంద్రకళ, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, కౌన్సిలర్లు లింగంపల్లి గంగరాజు, బొద్దుల శీను, కూరపాటి శ్రీశైలం, డిసిసి ప్రధాన కార్యదర్శి వేముల దామోదర్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఏండి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయకుంటే సింగరేణి వ్యాప్తంగా ఉద్యమం

- కార్మికుల సమస్యలపై ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తాం
- మెడికల్ బోర్డు పేరుతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని హెచ్‌ఎంఎస్ ఆరోపణ

**ప్రజానావ, నస్పూర్:** సింగరేణి కార్మికులకు యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సింగరేణి వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ హెచ్చరించారు. అవసరమైతే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని స్పష్టం చేశారు. గురువారం నస్పూర్‌లోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ లో బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బోడ జనార్ధన్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని, ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డు ప్రక్రియతో అది మరోసారి బహిర్గతమైందని ఆరోపించారు. సుమారు 2,000 మంది కార్మికులు మెడికల్ బోర్డు కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 24 మందిని మాత్రమే ఇన్‌వాలిడేషన్‌కు ఎంపిక చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. సింగరేణిలో టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన బాయి బాట కార్యక్రమంలో బొగ్గు గనుల కార్మికులు తమ ఉద్యోగ భద్రతపై ఆవేదన వ్యక్తం చేయడంతో, మెడికల్ బోర్డు నిర్వహించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ఆమె హెచ్చరించడంతోనే యాజమాన్యం బోర్డు నిర్వహించిందని పేర్కొన్నారు. అయితే ఆ ప్రక్రియలో కేవలం 24 మందికే అవకాశం కల్పించడం ద్వారా వేలాది మంది కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ అంశంపై గుర్తింపు కార్మిక సంఘం, ప్రజాప్రతిని ధులు స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. వేల కోట్ల రూపాయలతో కమ్యూనిటీ హాళ్లు నిర్మించినప్పటికీ సింగరేణి అధికారిక కార్యక్రమాలను ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో నిర్వహించడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. ప్రకృతి విరుద్ధ పరిస్థితుల్లో పనిచేస్తున్న సింగరేణి కార్మికులకు వీఆర్ఎస్ పథకాన్ని అమలు చేయాల్సి ఉండగా గుర్తింపు కార్మిక సంఘమే దానిని అడ్డుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కారుణ్య నియామకాల పేరుతో అవినీతి నియామకాలకు పాల్పడిందని విమర్శించారు. నామమాత్రపు మెడికల్ బోర్డు నిర్వహణపై కూడా గుర్తింపు కార్మిక సంఘం నోరు మెదపకపోవడం, ఎమ్మెల్సీ పదవి కోసం ప్రభు త్వంతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని కార్మికులను మోసం చేస్తోందని ఆరోపించారు. కార్మికుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సమ్మె నోటీసు ఇచ్చి నిరాహార దీక్ష చేపట్టాలని గుర్తింపు కార్మిక సంఘానికి సవాల్ విసిరారు. సింగరేణిలో ఖాళీలు ఉన్నప్పటికీ శాశ్వత నియామకాలు చేపట్టకుండా కాంట్రాక్ట్ కార్మికులు, అప్రెంటిస్ ఉద్యోగులతో పనులు చేయించడం సరికాదన్నారు. తాడిచెర్ల–2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించినట్లుగానే మిగి లిన 18 ప్రాజెక్టులను కూడా సంస్థకు కేటాయించాలని, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో శాశ్వత కార్మికులతోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, టీఆర్ఎస్ యువజన జిల్లా నాయకులు మేడి రాజశేఖర్, రాధాకృష్ణ, తన్వీర్, ఖలీద్ అహ్మద్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ గోదావరిఖనిలో కాంగ్రెస్ ధర్నా

- ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ ఎప్పటికీ సహించదు
- ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్

ప్రజానావ, గోదావరిఖని: ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నిరుద్యోగ యువతపై దాడిని ఖండిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ఎదుట ఆందోళనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ బుధవారం గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం ఎదుట రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానపరచడమేనని అన్నారు. ప్రతిపక్షం ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం బీజేపీ ప్రభుత్వంలో నిత్యకృత్యంగా మారిందని విమర్శించారు. ప్రజాస్వా మ్యంలో భిన్నాభిప్రాయాలను గౌరవించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ అధ్యక్షుడు, పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు వేగవంతం

**అదనపు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం**

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. నగేష్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ జిల్లాలోని వక్ఫ్ ఆస్తులు, భూములు, వాటికి సంబంధించిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ వివాదాలు తలెత్తిన సందర్భంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జిల్లా వక్ఫ్ కమిటీకి చెందిన ఎన్జీవో సభ్యుడు, మహిళా సభ్యురాలు, న్యాయవాది సభ్యుడు ప్రస్తుతం ఉన్న వక్ఫ్ వివాదాలను సమావేశంలో ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమావేశంలో డీఎస్పీ, డీఆర్ఓ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జి. కుమారస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే అండ్ ల్యాండ్), సబ్–రిజిస్ట్రార్, జిల్లా వక్ఫ్ కమిటీ సభ్యులు, జిల్లా వక్ఫ్ ఇన్‌స్పెక్టర్, మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిలో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- 21వ శతాబ్దపు నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఏఐ, ఐసీటీ ఆధారిత బోధనా విధానాలను సమర్థవంతంగా వినియోగించాలి



ప్రజానావ, పెద్దపల్లి : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా లోని ప్రధానోపాధ్యాయుల మూడురోజుల ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగు పరుచుకుంటూ ప్రతి విద్యార్థి నిర్దేశిత లెర్నింగ్ అవుట్‌కమ్స్ సాధించేలా హెఎమ్‌లు, రెమిడియలు తరగతులు నిర్వాహించాలని అన్నారు. ముఖ్యంగా చదవడం (రీడింగ్), రాయడం (రైటింగ్), విమర్శనాత్మక ఆలోచన (క్రిటికల్ థింకింగ్), సమస్య పరిష్కార నైపుణ్యాలు (ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్), కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేలా బోధన కొనసాగించాలని తెలిపారు. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రిమీడియల్ తరగతులు నిర్వహించడం ద్వారా అవసరమైన విద్యా సహాయా న్ని అందించాలని, ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో అవసరమైన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగం, బోధనలో ఏఐ టూల్స్‌ను ఉపయోగించి సమర్థవంతంగా నిర్వహిం చడం వంటి అంశాలపై రిసోర్స్ పర్సన్లు శిక్షణ అందించారు. అదేవిధంగా ఐసీటీ ఆధారిత బోధనలో భాగంగా దీక్ష యాప్ వినియోగం, శిక్షా ఫౌండేషన్ రూపొందించిన శిక్ష కో–పైలట్ వేదికను విద్యాబో ధనలో ఉపయో గించే విధానాన్ని వివరించారు. బొమ్మ లు, ఆటల ఆధారిత సైన్స్ బోధన, తరగతి గదిలో పాఠ్యపుస్తకాన్ని సమర్థవంతంగా వినియోగించడం, అభ్యాస దీపికలు, ప్రభుత్వం అందించే వర్క్‌బుక్‌ల వినియోగం, ప్రయోగాత్మక బోధనలో ల్యాబొరేటరీ మాన్యువల్‌ను తప్పనిసరిగా ఉపయోగించాల్సిన అవసరాన్ని రిసోర్స్ పర్సన్లు అన్నపూర్ణ, లక్ష్మణ్, రాగమాయి, మల్లారెడ్డిలు వివరించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులతో కలెక్టర్ ప్రత్యక్షంగా ముచ్చటించి, శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కృత్యాధారిత (యాక్టివిటీ బేస్డ్) బోధన ద్వారా విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన శిక్షణతో పోలిస్తే ఈ ఏడాది శిక్షణలో పొందుపరిచిన ముఖ్యాంశాలను మరోసారి పునశ్చరణ చేసుకుని, వాటిని తరగతి గదిలో అమలు చేసి విద్యార్థులను ఉత్తమ ప్రగతి దిశగా నడిపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హెఎం లు పాల్గొన్నారు.

# కేంద్రానివి రాజకీయ కక్షసాధింపు చర్యలే



**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని, అక్రమ అరెస్టులను నిరసిస్తూ గురువారం రేవల్లీ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ, టిపిసిసి పిలుపు మేరకు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి ఆదేశాల ప్రకారం.. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుల్తాన్ అలీ ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రాహుల్ గాంధీ గొంతు నొక్కేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల స్వరాన్ని అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కార్యదర్శి వాడల పర్వ తాలు, మండల ఉపాధ్యక్షుడు కే. బంగారు శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మిద్దె స్వామి, సర్పంచులు అంజలమ్మ, దూపం రాజు, డిప్యూటీ సర్పంచ్ అశ్విని, ఏఎంసి డైరెక్టర్ తిరుపతయ్య, సీనియర్ నాయకులు బాలస్వామి, వెంకటస్వామి గౌడ్, బాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కరుణాకర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






# సైబర్ నేరాల నియంత్రణకు అవగాహనే కీలకం

**డీజీపీ సీవీ ఆనంద్**

**ప్రజనావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** సైబర్ మోసాల నియంత్రణకు సాంకేతికతతో పాటు ప్రజల్లో అవగాహనే కీలకమని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. గురువారం డిజిపి కార్యాలయం నుండి సైబర్ నేరాల నివారణపై కమిషనర్లు, ఎస్పీలు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వంటి కొత్త తరహా మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సైబర్ బాధితులు వెంటనే 1930 లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే నగదును ఫ్రీజ్ చేసి, తిరిగి అందిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి పాల్గొన్న వనపర్తి ఎస్పీ సునితా రెడ్డి జిల్లాలో నమోదైన సైబర్ కేసుల వివరాలను డీజీపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ బాలాజీ నాయక్, సైబర్ క్రైమ్ సీఐ శ్రీను నాయక్, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు

ప్రజానావ, పెద్దపల్లి : నేడు జరగబోయే బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా స్థానిక పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో టిఎస్ టిఎస్ మాజీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు జన్మదినం వేడుకల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్స్ బిక్షపతి, స్వామి, ఉపసర్పంచ్ మేకల కుమార్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి, పడాల సతీష్ గౌడ్, బింగి రాజు, మేడుదుల రాజ్ కుమార్, ఉప్పు శివ కుమార్, బోయిని మనోజ్, పెంచాల శ్రీకాంత్, శ్రీకాంత్, కంచి నాగరాజ్, దాసరి సతీష్, ఇరుగురాల స్వామి దాస్, సాయి, వెంకటేష్, కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# యువత ఆక్రోశానికి.. సమాధానమేది?

నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరగోళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదం డ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావిం చి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇక పోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. వలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు డా ఉభయ సభల్లో గందర గోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీజీపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీజీకి బాధ్యతగా కేంద్ర మంత్రి ధర్మేం ద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళ నకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందు కంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు... పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరగోళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదం డ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావిం చి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇక పోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. వలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీజీ, అయోధ్య విరా ళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపే స్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పా ల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనం గా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పం చాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉం టే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవ స్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కు గా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాం కు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి. ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి సుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరి వరకు డా ఇది తప్పు అని డా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో రుకు పోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్య లను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచాని ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనులంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యో గాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకలు తమ తీరును మార్చుకోవాలి. ఇది ఒద్ర రాష్ట్రాల పాలకులుకు ఓ హెచ్చరిక కావాలి. అలాగే ఈ యువ నిరసన ఒక ఆరంభం మాత్రమే. ఇది దావానలంలా విస్తరించినా ఆశ్చర్య పోనవసరం లేదు. పాలకులు బుద్ధి తెచ్చుకుని మారకపోతే యువత చరిత్ర సృష్టిస్తుందని చెప్పక తప్పదు.

విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు.

EDITORIAL



# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు అడుగులు!

- 100 అడుగుల మేర రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు
- అఖిలపక్ష సమావేశంలో ఆర్డీవో సరిత వెల్లడి

**ప్రజనావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** షాద్‌నగర్ పట్టణం లో తీవ్ర ట్రాఫిక్ సమస్యగా మారిన ప్రధాన చౌరస్తా విస్తరణకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. చౌరస్తాను 100 అడుగుల మేర విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్డీవో ఎన్.ఆర్. సరిత తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలు ఉండటంతో ఫ్రీ లెఫ్ట్ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. విగ్రహాలను గౌరవప్రదంగా మరోచోటికి తరలించి, విస్తరణ అనంతరం ప్రజల డిమాండ్ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఆక్రమణలు తొలగించి, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కమిషనర్ సునీతారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

రూ.11.55 లక్షల విలువైన గంజాయి స్వాధీనం.. ఏడుగురు అరెస్ట్




**ప్రజానావ, ఖమ్మం:** జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. పోలీసు కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం నిర్వహిం చిన ప్రత్యేక తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఏడుగురిని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కల్లూరు పట్టణ శివారు లోని కాశ్మీర శివాలయం ఖాళీ ప్రాంగణంలో గంజా యి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అంద డంతో ఏసీపీ వసుందరా యాదవ్ పర్యవేక్షణలో ఎస్సై హరిత బృందం దాడులు నిర్వహించింది. ఈ సంద ర్భంగా ఐదుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11.55 లక్షల విలువైన 23.100 కిలోల ఎండు గంజాయి, ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకుంది. పాల్వంచకు చెందిన మహమ్మద్ అన్వర్, మహమ్మద్ వజీర్ ఖాన్, కల్లూరుకు చెందిన షేక్ ముజాహిద్ పాషా, హైదరాబాద్‌కు చెందిన దేవరం రాకేష్, సికింద్రాబాద్‌కు చెందిన మహమ్మద్ ఆదిల్‌లను అరెస్ట్ చేయగా, ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన రాజు, కార్తీక్ పరారీలో ఉన్నారు. ఒడిశా నుంచి కిలో రూ.3 వేల చొప్పున గంజాయి కొనుగోలు చేసి హైదరా బాద్‌లో కిలో రూ.12 వేల చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన సీఐ ముత్తులింగయ్య, ఎస్సై హరితతో పాటు సిబ్బం దిని ఏసీపీ అభినందించారు. మధిర పట్టణంలో వైరా ఏసీపీ సారంగపాణి ఆధ్వర్యంలో టౌన్ సీఐ డి.రమేష్, ఎస్సైలు కిషోర్ కుమార్, నవిత బృందాలు ప్రత్యేక తనిఖీలు చేపట్టాయి. ఖమ్మం నుంచి వచ్చిన నార్కో టిక్ డాగ్ పింకీ, డాగ్ హ్యాండ్లర్ రవి సహాయంతో రైల్వే స్టేషన్, బస్టాండ్, హోటళ్లు, విద్యాసంస్థల పరిస రాలు, పాన్ షాపులు, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ కొరియర్ స్టాక్ పాయింట్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిం చారు. గంజాయి రవాణా లేదా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరిస్తూ, సమాచారం ఉంటే 871265 9160 లేదా 1908 నంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు. ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాశ్‌నగర్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాస్ నగర్‌కు చెందిన బాసెట్టి పవన్ కుమార్, జహీరాపుర తండాకు చెందిన దేవత్ అరవింద్‌ల వద్ద నుంచి 22 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని బండి ప్రవీణ్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు విచారణలో తేలడంతో పరారీలో ఉన్న ప్రవీణ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి డిజిటల్ ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రు లు పిల్లల ప్రవర్తనను నిశితంగా గమనిం చాలని పోలీ సులు సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధిం చిన సమాచారం తెలిసిన వారు డయల్ 100, 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారదారుల వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు తగిన పారితోషికం అందజేస్తామని వెల్లడించారు.

# విద్యార్థులపై లాఠీచార్జీ దారుణం

కేంద్ర విద్యాశాఖ మంత్రి, ప్రధాని రాజీనామా చేయాలి: కాంగ్రెస్




**ప్రజానావ, గజ్వేల్:** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జీని, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ములుగు మండల కేంద్రంలో గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రాజీవ్ రహదారిపై ములుగు స్టేజ్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటీ బచావో, బేటీ పడావో అంటూ నినదించే ప్రధాని నరేంద్ర మోదీ, ఢిల్లీలో విద్యార్థినులపై జరిగిన పోలీసుల దాడిపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పేపర్ లీక్‌లపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఉద్యమిస్తే వారిని అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమ న్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని, ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పోలీసులు వ్యవహరించిన తీరును ఆమె తీవ్రంగా ఖండించారు. తెలంగాణలో ఇంటర్ విద్యార్థుల మరణాలకు కారణమైన గ్లోబరెనా సంస్థతో బీఆర్ఎస్ ప్రభుత్వం పతనమైందని, ఇప్పుడు అదే సంస్థతో సంబంధాలు పెట్టుకుని సీబీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలకు బీజేపీ ప్రభుత్వం కారణమైందని ఆరోపించారు. కార్యక్ర మంలో జిల్లా పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడు కడపల్ల నరసింహారెడ్డి, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు విజయ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ గుప్తా, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోచిరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుంట్ల జగదీశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాస్, వాజీద్, సర్పంచులు లహరి శ్రీధర్ రెడ్డి, ముత్యం రెడ్డి, ఎడ్ల పోచయ్య, మచ్చల కృష్ణ, బుర్కల మమత–కనకయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలి

బీఎస్పీ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు మిద్దె మహేష్



**ప్రజనావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవక లు, పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ రాజీ నామా చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు మిద్దె మహేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని, అలాగే పరీక్షల నిర్వహణ వ్యవస్థలో పారదర్శకత కోసం తగిన సంస్కరణలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.




# స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి

**ప్రజనావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న తెలుగు భాషా ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో 'క్లాస్‌మేట్ క్లబ్' ఆధ్వర్యంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు పండితులు బూరోజు గిరిరాజాచారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్, తిలక్ చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ శివాజీ అధ్యక్షతన, క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో తెలుగు భాషా శిక్షణా కార్యక్రమ ఆర్‌పీలు భానుచందర్, జయంత్ రెడ్డి, రాజారెడ్డి, సుధాకర్ చారి, నరసింహస్వామిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వనపర్తి, గోపాల్‌పేట, పెద్దమందడి, రేవల్లి మండలాల ఉన్నత పాఠశాలల తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నీట్ లీక్‌పై కాంగ్రెస్ రాస్తారోకో

విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ చెలగాటం: మంత్రి కొండా సురేఖ




**ప్రజానావ, ఆలేరు:** నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటన, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జీ, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ యాదగిరిగుట్టలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని తీవ్రంగా విమర్శించారు. గత 12 ఏళ్లలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో 150కు పైగా ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని ఆరోపించారు. పరీక్షల్లో జరుగుతున్న అవకతవకలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమా నుషమని, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఈడ్చుకెళ్లడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. మహిళా కానిస్టేబుళ్లతో ప్రియాంక గాంధీని తోసివేయించడం బీజేపీ పాలనలో అరాచకా నికి నిదర్శనమని విమర్శించారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేసి పారదర్శక వ్యవస్థ ద్వారా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.




# ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

- స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి: కలెక్టరేట్‌ను ముట్టడించిన ఏఐఎస్‌ఎఫ్
- నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముట్టడి.. విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్
- విద్యారంగ బడ్జెట్ 20% పెంచాలి: ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ.. జీవో నెం. 7, 8, 9లను రద్దు చేసి పాత విధానంలోనే ఫెలోషిప్‌లు, స్కాలర్‌షిప్‌లు వర్తింపజేయాల న్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని, తక్షణమే రాష్ట్రానికి పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఫన్నీ, అర్జున్, చరణ్, యశ్వంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

# నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

ఏదులలో కాంగ్రెస్ నిరసన ప్రదర్శన

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** నీట్ పేపర్ లీకేజీని అడ్డుకోవడంలో విఫలమైన కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం ఏదుల మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... నీట్ పేపర్‌ను లీక్ చేస్తూ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం ఆడుకుంటోందని మండిపడ్డారు. పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, మనస్తాపంతో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో విద్యార్థుల తరుపున గళమెత్తుతున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ఎంపీల అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ కొంకి వెంకటేష్, మండల ఇంచార్జ్ వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షుడు పందెం సుఖేందర్‌రెడ్డి, చీరకపల్లి సర్పంచ్ రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమ్మి మల్లేష్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు జానకిరామ్ యాదవ్, గ్రామ అధ్యక్షుడు రమేష్, నాయకులు శేషిరెడ్డి, పరశురాం, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## కార్మిక హక్కుల పరిరక్షణే బీఎంఎస్ లక్ష్యం

- సింగరేణి వ్యాప్తంగా ఘనంగా బీఎంఎస్ 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- 12వ వేజ్‌బోర్డు ఏర్పాటు సహా కార్మిక సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం : వడ్డేపల్లి కుమారస్వామి

**ప్రజానావ, రామగుండం:** దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘమైన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గోదావరిఖనిలోని బీఎంఎస్ కేంద్ర కార్యాలయం, ఓసీపీ–5 గనితో పాటు సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, విభాగాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమార స్వామి మాట్లాడుతూ, 1955 జూలై 23న పూజ్యనీయ దత్తోపంత్ ఠేంగడి భోపాల్‌లో స్థాపించిన భారతీయ మజ్దూర్ సంఘ్ నేడు దేశంలోనే అతి పెద్ద కార్మిక సంఘంగా ఎదిగిందని పేర్కొన్నారు. బీఎంఎస్ సిద్ధాంతమైన దేశ్ హిత్ మే కరేంగే కామ్.. కామ్ కా లేంగే పూరా దామ్ అనే నినాదాన్ని ఆచరణలో పెడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత, సురక్షితమైన పని వాతావరణం, పరిశ్రమల అభివృద్ధి, దేశ ప్రగతి కోసం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల సమస్యల పరిష్కారం, 12వ వేజ్‌బోర్డు తక్షణ ఏర్పాటు, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం, పెన్షనర్ల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై బీఎంఎస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణిలోని అన్ని గనులు, శాఖల్లో బీఎంఎస్ పతాకావిష్కరణ, మహనీయుల చిత్రపటాలకు పుష్పాంజలి, కార్మిక సమావేశాలు, స్వీట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించగా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ కేంద్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై. సారంగపాణి, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల హరిన్, కేంద్ర కోశాధికారి సాయవేన సతీష్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ కర్రవుల మహేష్, కార్యదర్శి మేడ రామ్మూర్తి, నాయకులు ఎల్లావుల కోటయ్య, అజయ్, నాగరాజు, సంగని సాంబయ్య, వెంకటేష్, ప్రసాద్, కుమార్, కల్వల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

Singareni news

## కాంట్రాక్టు కార్మికులకు హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన

- ఈఎస్ఐ, ప్రమాద బీమా, సామాజిక భద్రతపై ప్రత్యేక సదస్సు
- సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



**ప్రజానావ, రామగుండం:** రామగుండం ఏరియా–1 సివిల్ విభాగంలో పనిచేస్తున్న వివిధ కాంట్రాక్టు కార్మికులకు వారి హక్కులు, బాధ్యతలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, కార్మిక చట్టాల ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు లభించే హక్కులు, విధి నిర్వహణలో పాటించాల్సిన బాధ్యతలు, సింగరేణి సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. కార్మికులు తమ హక్కులను తెలుసుకుని విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈఎస్ఐ ద్వారా కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉన్న వైద్య సేవలు, ఉచిత చికిత్స, మందులు, ఆసుపత్రి సేవలు, ప్రసూతి సదుపాయాలు, ప్రమాదాల సమయంలో లభించే ప్రయోజనాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డుతో అనుబంధంగా లభించే బీమా రక్షణ, ప్రమాద బీమా, అత్యవసర పరిస్థితుల్లో అందే ఆర్థిక సహాయం, బీమా ప్రయోజనాలను ఎలా వినియోగించుకోవాలో సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా కార్మికులు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చి, ప్రభుత్వం, సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్మికుల సంక్షేమం, భద్రత, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ డీజీఎం కె.డి.వి. వరప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ప్రతాప్ గిరిరాజు, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, ప్రణిత్, అజయ్, సివిల్ విభాగ సూపర్వైజర్లు, సిబ్బంది, వివిధ కాంట్రాక్టర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు, తోటమాలీలు, స్వీపర్లు తదితర కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఉద్యోగులకు కోటి ప్రమాద బీమా

### సూపర్‌బజార్ ఉద్యోగులకూ వర్తింపునకు కృషి : ఏఐటీయూసీ

**ప్రజానావ, నస్పూర్:** సింగరేణి సంస్థ పరిధిలోని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కార్పొరేట్ సాలరీ అకౌంట్ ద్వారా అందించే రూ.1 కోటి ప్రమాద బీమా సౌకర్యం వర్తించేలా సంబంధిత బ్యాంకులు అంగీకరించినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు వారు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, కార్పొరేట్ సాలరీ అకౌంట్ కలిగిన ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో నిబంధనల ప్రకారం అతని కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ నిర్ణయం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు ఎంతో భరోసా కలిగిస్తుందని తెలిపారు. అలాగే సింగరేణి సూపర్‌బజార్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఇదే తరహా రూ.1 కోటి ప్రమాద బీమా సౌకర్యం వర్తించేలా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యంతో పాటు సంబంధిత బ్యాంకులతో నిరంతరం చర్చలు జరుపుతూ కృషి చేస్తోందని వెల్లడించారు. సింగరేణి సంస్థ పరిధిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి సమాన సంక్షేమ సౌకర్యాలు, భద్రతా పరిరక్షణ, ఆర్థిక రక్షణ కల్పించడమే ఏఐటీయూసీ లక్ష్యమని స్పష్టం చేశారు.

# 7 వేల మెగావాట్ల 'ఎల్‌నినో' షాక్‌ను తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ

- రాష్ట్రంలో పవర్ కట్ అనేదే లేదు
- హనుమకొండ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ప్రజానావ, హనుమకొండ:** వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, జల విద్యుత్ ఉత్పత్తి తగ్గుదలతో ఒకేసారి ఎదురైన 7 వేల మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ సమర్థవంతంగా తట్టు కుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సాధారణంగా వర్షాకాలంలో 11 వేల మెగావాట్లుగా ఉండే పీక్ విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరిందని చెప్పారు. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో సుమారు 2 వేల మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపో యిందన్నారు. ఈ పరిస్థితుల్లోనూ విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి, ముందస్తు ప్రణాళికలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా నాణ్య మైన విద్యుత్ సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీఎండీ వరుణ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, పరిధిలోని కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు బోర్‌వెల్స్‌ను అధికంగా వినియోగించడం వల్ల విద్యుత్ డిమాండ్ పెరిగిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పరిస్థితిని విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. రాష్ట్రంలో 'పవర్ కట్' అనేదే లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు, ఈదురుగాలులు వంటి ప్రకృతి వైపరీత్యాల కారణంగా విద్యుత్ స్తంభాలు, లైన్లపై చెట్లు పడినప్పుడు మాత్రమే తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందని, దానిని పవర్ కట్‌గా భావించవద్దని సూచించారు. 'ప్రజాబాట', 'పొలం బాట' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా అధికారులు ప్రజల వద్దకే వెళ్లి విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నారని అభినందించారు.

### డిస్కంలను దేశంలోనే నంబర్–1గా తీర్చిదిద్దుతాం

గతంలో అధిక వడ్డీలకు తీసుకున్న పాత రుణాలను రీస్ట్రక్చరింగ్ చేయడం ద్వారా డిస్కంల రుణభారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎన్‌డీసీఎల్ NPDCL, SPDCL డిస్కంలను దేశంలోనే నంబర్–1 స్థానంలో నిలిపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.

### దేశంలోనే తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్'

విద్యుత్ సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో 'ఎలక్ట్రిసిటీ అంబులెన్స్' సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. వైద్యారోగ్య శాఖలో 108 అంబ్యులెన్స్ సేవల తరహాలోనే విద్యుత్ అత్యవసర సమస్యలను పరిష్కరించేందుకు ఈ వాహనాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లు, అవసరమైన పరికరాలతో పాటు నిపుణులైన ఇంజనీర్లు ఈ అంబులెన్స్‌లలో అందుబాటులో ఉంటారని తెలిపారు. వినియోగదారులు ఉచిత టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయగానే, కృత్రిమ మేధ (AI) సాంకేతికత ద్వారా ఫిర్యాదును స్వీకరించి, ఆటోమేటిక్‌గా సంబంధిత ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్ సిబ్బందికి సమాచారం చేరుతుందని వివరించారు. దీంతో సిబ్బంది నిమిషాల వ్యవధిలోనే ఘటనాస్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు.

### లైన్‌మెన్ల సంక్షేమానికి రూ.1.20 కోట్ల బీమా

విద్యుత్ వ్యవస్థకు మూలస్తంభాలైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. విధి నిర్వహణలో అనుకోని ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే వారి కుటుంబానికి అండగా ఉండేందుకు రూ.1.20 కోట్ల బీమా సౌకర్యం కల్పించామని చెప్పారు. లైన్ క్లియరెన్స్ సమయంలో ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన సేఫ్టీ కిట్లు, యూనిఫారాలు అందించినట్లు తెలిపారు.

### 53 లక్షల కుటుంబాలకు 'గృహజ్యోతి' ప్రయోజనం

'గృహజ్యోతి' పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల విద్యుత్ బిల్లుల మొత్తాన్ని ఆర్థిక శాఖ డిస్కం సంస్థలకు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా అందించే రూ.14 వేల కోట్ల విద్యుత్ సబ్సిడీ నిధులను కూడా ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు విడుదల చేస్తోందని వెల్లడించారు.

## రాజన్న సిరిసిల్లలో యువకుడి ఆత్మహత్య

### 'నా చావుకు మోదీ కారణం... ఇట్లు భారత దేశ పౌరుడు అంటూ సూసైడ్ నోట్'

### సంచలనం సృష్టించిన సూసైడ్ నోట్



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో యువకుడి ఆత్మహత్య ఉదంతం తీవ్ర సంచలనం సృష్టించింది. గురువారం ఉదయం పిట్లా వంశీ (25) అనే యువకుడు ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే తన చావుకు పీఎం మోదీ కారణం అంటూ సూసైడ్ నోట్ లభ్యం కావడంతో ఈ సంఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఘటనా స్థలంలో మృతుడు రాసినట్లుగా ఉన్న ఓ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సూసైడ్ నోట్ లభించడం స్థానికంగా సంచలనం సృష్టించింది. నా చావుకు పీఎం మోదీ కారణం.. అంతే కానీ నా చావుకి, నా ఫ్యామిలీకి సంబంధం లేదు. దయచేసి ఎవరినీ ఇబ్బంది పెట్టొద్దు.. నా అంత్యక్రియలు ఆనవాయితీగా జరిపించండి.. ఇట్లు భారత పౌరుడు, థాంక్యూ గవర్నమెంట్ అని ఆ లేఖలో పేర్కొన్నట్లు ఉంది. ఎస్ ఐ ఆర్ పత్రంపై ఈ లేఖను రాయగా, థాంక్యూ గవర్నమెంట్ అనే పదం మాత్రం ఇంగ్లీషులో రాశాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు
- ప్రభుత్వాలను కూల్చాలన్న నిర్మించాలన్న విద్యార్థులతోనే సాధ్యం
- విద్యార్థులను విస్మరించిన ప్రభుత్వాలు మనుగడలో లేవు
- ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేణుకుంట్ల ప్రీతం, ఆర్నకొండ సాయి ఆజాద్



**ప్రజానావ, పెద్దపల్లి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కేజీ టు పీజీ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని వందల మంది విద్యార్థులతో ముట్టడించడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష అండ్ కార్యదర్శులు రేణుకుంట్ల ప్రీతం, ఆర్నకొండ సాయి ఆజాద్ అన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలసాని లెనిన్, పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, జిల్లా అధ్యక్షులు ఆర్నకొండ సాయి ఆజాద్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.11 వేల కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ ని వెంటనే విడుదల చేసి జిఓ నెంబర్ 7, 8, 9 లను రద్దు చేయాలని, రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదించాలనే ఆలోచనను మానుకోవాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్, ఎంఈఓ, డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించి నిధులు కేటాయించాలని, అద్దె భవనాలలో నడుస్తున్న పాఠశాలలు, హాస్టల్స్ గురుకులాలకు, సొంత భవనాలు నిర్మించాలని, శిధిలావస్థలో ఉన్న పాఠశాలలకు, కళాశాలలకు మరమ్మతులు చేయాలని, విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, విద్యాహక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని, రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండ్ల లక్ష్మీ ప్రసన్న, మహంకాళి శ్రీవర్ధన్, అనుప్ సాయి, అభిషేక్, చైత్ర, ఆదిత్య, మాహీన్, సాయి, అభిషేక్, గణేష్, గొడిసెల ప్రణీత్, సూర్య ప్రకాష్, రాహుల్, రోహిత్, జశ్వంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మరింత మెరుగు పడాలి

- ఎంఈఓలు, హెచ్ ఎంలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలి
- ప్రతి విద్యాలయాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి
- ఆన్‌లైన్ అన్ని వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పీజీఐపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష




**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రభుత్వ విద్యాలయాల్లోని విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మరింత మెరుగు పడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ) పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.. జిల్లా విద్యాశాఖ అధికారి మొండయ్య, కో ఆర్డినేటర్లతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పీజీఐ)లో భాగంగా జిల్లాకు వివిధ అంశాల్లో వచ్చిన గ్రేడింగ్, పాయింట్స్ తదితర విషయాలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు మరింత మెరుగు పడేలా ఒక ప్రణాళిక రూపొందించాలని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్ తదితర పాఠ్యాంశాల్లో ప్రతిభ చూపేలా, విద్యార్థులు అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పేలా, రాసేలా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా విద్యాధికారి తమ పరిధిలోని మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ ఎంలతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్ ఎంలు షెడ్యూల్ ప్రకారం తమ పరిధిలోని అన్ని విద్యాలయాల్లో తనిఖీ చేసి.. ఆ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. టీచర్ల ట్రైనింగ్ వివరాలు, అన్ని విద్యాలయాల్లో కంప్యూటర్లు, ట్యాబ్ లు, ఇంటర్నెట్ కనెక్షన్, ఐ ఎఫ్ బీ ప్యానెల్స్, టాయిలెట్స్, తరగతి గదులు, మైదానం, ఇతర మౌలిక సదుపాయాల పూర్తి సమాచారాన్ని ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. అన్ని విభాగాల్లో ఉత్తమ పనితీరు చూపాలని, విద్యా రంగంలో జిల్లాలో మెరుగైన స్థానంలో ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, కో ఆర్డినేటర్లు తదితరులు ఉన్నారు.

## సమావేశంలో రసాభాస.. చర్చలు లేకుండానే వాయిదా

### ఎజెండాలో బిల్లుల అంశాలపై బీజేపీ కౌన్సిలర్ల అభ్యంతరం

**ప్రజానావ, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపల్ సర్వసభ్య సమావేశం గురువారం గందరగోళ పరిస్థితుల మధ్య రసాభాసగా మారి చివరకు వాయిదా పడింది. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చలు జరగకుండానే సమావేశాన్ని వాయిదా వేయడం చర్చనీయాంశమైంది. సమావేశం అనంతరం బీజేపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ.. సమావేశానికి ముందు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో జరిగిన చర్చల్లో శానిటేషన్, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ వంటి ప్రజా సమస్యలకే ప్రాధాన్యం ఇవ్వాలని, బిల్లులకు సంబంధించిన అంశాలను ఎజెండాలో చేర్చకూడదని నిర్ణయించినట్లు తెలిపారు. అయితే ఆ నిర్ణయాన్ని పక్కనబెట్టి మళ్లీ బిల్లుల అంశాలను ఎజెండాలో చేర్చారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు అభ్యంతరాలు తెలియ జేస్తూ డిసెంట్ నోటీసు కూడా అందజేసినట్లు వెల్లడించారు. ప్రజాధనాన్ని ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా కాపాడేందుకు తాము కట్టుబడి ఉంటామని బీజేపీ కౌన్సిలర్లు స్పష్టం చేశారు.

# రాజేందర్‌రెడ్డి మృతితో గుండ్లపల్లిలో ఉద్రిక్తత

- నిందితుల అరెస్టు చేయాలని రాజీవ్ రహదారిపై బైఠాయింపు
- పీఏ మురళీధర్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నం.. లాఠీచార్జ్‌తో చెదరగొట్టిన పోలీసులు

**ప్రజానావ, తిమ్మాపూర్:** గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బేతల్లి సమత భర్త రాజేందర్‌రెడ్డి మృతితో గురువారం గుండ్లపల్లి గ్రామం, రాజీవ్ రహదారి పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తనపై అక్రమంగా కేసులు నమోదు చేయించారని ఆరోపిస్తూ ఇటీవల ఎమ్మెల్యే పర్సనల్ పీఏ మురళీధర్‌రెడ్డిపై నిరసనగా ఎమ్మెల్యే ప్రజాభవన్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకున్న రాజేందర్‌రెడ్డి గత వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు భారీ బందోబస్తుతో గుండ్లపల్లి గ్రామానికి తరలిస్తుండగా, మృతికి కారణమైన ఎమ్మెల్యే పర్సనల్ పీఏ మురళీధర్‌రెడ్డితో పాటు మరో నలుగురు నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. అయితే రాజీవ్ రహదారిపై గుండ్లపల్లి స్టేజ్ వద్దకు చేరుకోగానే మృతుని భార్య సమతతో పాటు బంధువులు రోడ్డుపై బైఠాయించి నిందితుల అరెస్టు జరిగే వరకు కదిలేది లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాజీవ్ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వారితో చర్చించి రహదారి నుంచి తొలగించిన అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని ఎమ్మెల్యే పర్సనల్ పీఏ మురళీధర్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్న బంధువులు ఒక్కసారిగా ఇంటిని ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోగా పరిస్థితి అదుపుతప్పడంతో ఏసీపీ ఆధ్వర్యంలో పోలీసులు లాఠీచార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ సందర్భంగా మృతుని భార్య సమత మాట్లాడుతూ, పోలీసుల హామీ మేరకు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చినప్పటికీ నిందితులపై వెంటనే చర్యలు తీసుకుని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తన భర్త మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# బొల్లికుంటలో మళ్లీ ఉద్రిక్తత

- శివాజీ విగ్రహం ఏర్పాటు డిమాండ్‌తో జాతీయ రహదారిపై నిరసనకు యత్నం
- ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు.. కలెక్టర్ కోసం రెండు వర్గాల నిరీక్షణ




**ప్రజానావ, వరంగల్ :** వరంగల్ జిల్లా బొల్లికుంటలో శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు వివాదం గురువారం మరోసారి ఉద్రిక్తతకు దారి తీసింది. విగ్రహాన్ని భూమిపూజ జరిగిన ప్రదేశంలోనే ప్రతిష్ఠించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల నాయకులు, స్థానికులు జాతీయ రహదారిపై నిరసన చేపట్టేందుకు ప్రయత్నించారు. పరిస్థితిని ముందుగానే గుర్తించిన పోలీసులు ఆందోళనకా రులను అడ్డుకుని రహదారిపైకి వెళ్లకుండా నిలువరిం చారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శివాజీ విగ్రహాన్ని ముందుగా నిర్ణయించిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని ఆందోళనకారులు పట్టుబట్టగా, సమస్య పరిష్కారం కోసం ఉదయం నుంచే రెండు వర్గాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌తో సమావేశం కావడానికి వేచి చూశారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు బొల్లికుంటలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు.



# పీఓకే ప్రధానిగా బాధ్యతలు చేపట్టాలి

- తమ పార్టీ గెలిస్తే బాధ్యతలు స్వీకరిస్తా
- పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్
- పీఓకేలో నిరసనల వేళ రాజకీయ ప్రకటనపై చర్చ

**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా దేశ ప్రధానిగా పనిచేసిన నాయకులు ప్రాంతీయ పదవులపై ఆసక్తి చూపకపోయినా, తాను పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) ప్రధానిగా బాధ్యతలు చేపట్టాలని కోరుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ముజఫరాబాద్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన నవాజ్ షరీఫ్, పీఓకే ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తే ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కోరుకుని అక్కడి ప్రధాని బాధ్యతలు స్వీకరిస్తానని తెలిపారు. పీఓకే అభివృద్ధిని స్వయంగా పర్యవేక్షించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పంజాబ్ ప్రావిన్స్‌కు ఎంత ప్రాధాన్యం ఇస్తానో, పీఓకేకూ అంతే ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. తమ పూర్వీకులు కశ్మీర్ ప్రాంతం నుంచే వలస వచ్చారని, అందుకే పీఓకే తనకు రెండో స్వగ్రామం లాంటిదని చెప్పారు. ఒకవేళ తాను ప్రధానిగా బాధ్యతలు చేపట్టకపోయినా ప్రతి మూడు నెలలకు ఒకసారి అక్కడ పర్యటించి అభివృద్ధి పనులను సమీక్షిస్తానని హామీ ఇచ్చారు. అయితే పీఓకేలో ప్రస్తుతం నెలకొన్న ప్రజా వ్యతిరేకత, నిరసనల నేపథ్యంలోనే నవాజ్ షరీఫ్ ఈ ప్రకటన చేశారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధిక ద్రవ్యోల్బణం, భారీ విద్యుత్ చార్జీలు, వీఐపీ సంస్కృతికి వ్యతిరేకంగా జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పీఓకే వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిర్బంధ చర్యలు, ఘర్షణల్లో ఇప్పటివరకు 30 మందికిపైగా మృతి చెందడంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఎన్నికల సమయంలో ప్రజల అసంతృప్తిని తగ్గించేందుకే నవాజ్ షరీఫ్ ఈ తరహా హామీలు ఇస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, పీఓకే పరిణామాలపై భారత్ మరోసారి తన వైఖరిని స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు భారతదేశంలో అంతర్భాగమని పునరుద్ఘాటించిన భారత్, పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన భూభాగాల్లో నిర్వహించే ఎన్నికలు గానీ, అక్కడి తాత్కాలిక అసెంబ్లీలు గానీ తమకు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది.

# ఎర్ర సంద్రంలో మళ్లీ మంటలు

- వాణిజ్య నౌకలపై హౌతీల వరుస దాడులు
- సౌదీ చమురు ట్యాంకర్‌పై క్షిపణి లేదా డ్రోన్ దాడి
- భారీ అగ్నిప్రమాదం
- హర్మూజ్, బాబ్ ఎల్–మండేబ్ జలసంధుల్లో తగ్గిన నౌకాయానం
- ప్రపంచ వాణిజ్యంపై ఆందోళనలు




**టెహ్రాన్ :** ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడుల పరంపర మరోసారి తీవ్రరూపం దాల్చింది. తాజాగా సౌదీ అరేబియా నైరుతి తీరంలో ప్రయాణిస్తున్న ఓ చమురు ట్యాంకర్‌పై గుర్తుతెలియని క్షిపణి లేదా డ్రోన్‌తో దాడి జరగడంతో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనను యునైటెడ్ కింగ్‌డమ్ మెరిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ధ్రువీకరించింది. సౌదీలోని అల్ షుకైక్‌కు నైరుతి దిశగా సుమారు 70 నాటికల్ మైళ్లు (130 కిలోమీటర్లు) దూరంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపింది. అదృష్టవశాత్తు ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని, సముద్ర పర్యావరణానికీ ఇప్పటివరకు ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఘటన అనంతరం నౌక సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా, సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుని తామే ఈ సైనిక దాడులు నిర్వహించినట్లు యెమెన్‌కు చెందిన హౌతీ రెబెల్స్ అధికారికంగా ప్రకటించారు. సౌదీ ప్రభుత్వం తమ నియంత్రణలో ఉన్న ప్రాంతాలపై దిగ్బంధం విధించిందనే ఆరోపణలతో సౌదీ నౌకలపై సముద్ర నిషేధం అమలు చేస్తున్నట్లు రెండు రోజుల క్రితమే హౌతీలు ప్రకటించగా, అదే హెచ్చరికల నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు భావిస్తున్నారు. బాబ్ ఎల్–మండేబ్ వంటి అత్యంత కీలక జలసంధికి సమీపంలో ఈ ఘటన జరగడంతో పశ్చిమాసియాలో సముద్ర మార్గాల భద్రతపై అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రముఖ నౌకాయాన విశ్లేషణ సంస్థ 'క్లెప్లర్' నివేదిక ప్రకారం భద్రతా పరిస్థితులు వేగంగా క్షీణిస్తుండటంతో హర్మూజ్, బాబ్ ఎల్–మండేబ్ జలసంధుల మీదుగా జరిగే నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి. హౌతీల హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ ఆఫ్ ఏడెన్ సమీపంలో అనేక వాణిజ్య నౌకలు తమ ప్రయాణాలను నిలిపివేసి వెనుదిరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఈ కీలక జలసంధుల్లో వరుస దాడులు కొనసాగితే ప్రపంచ నౌకాయాన మార్గాల్లో మార్పులు చోటుచేసుకోవడంతో పాటు సరుకు రవాణా ఛార్జీలు భారీగా పెరిగి అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ట్రంప్ హెచ్చరికలకు ఇరాన్ కౌంటర్

**అమెరికాపై 9/11 తరహా దాడుల ముప్పు**

హర్మూజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడులు జరిగితే ఆ దేశంలోని వంతెనలు, విద్యుత్ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులు చేస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు ఇరాన్ ఘాటుగా స్పందించింది. యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చితే అమెరికాలో 9/11 తరహా దాడులు చోటుచేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని టెహ్రాన్ హెచ్చరించింది. యుద్ధం కొనసాగితే అమెరికా జాతీయ సంతాప దినాలు ప్రకటించుకోవాల్సి వస్తుందని, ఇంధన కేంద్రాలు, కీలక వంతెనలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. హర్మూజ్ జలసంధిలో తమ సూచనలు పాటించే నౌకలకు మాత్రమే సురక్షిత ప్రయాణానికి అనుమతి ఉంటుందని ఇరాన్ ప్రభుత్వ అనుబంధ సంస్థ 'తస్నిమ్' విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మరోవైపు, హర్మూజ్ జలసంధిలోని నౌకలపై ఇరాన్ డ్రోన్లు లేదా క్షిపణులతో ఏ రూపంలో దాడి చేసినా ప్రతిసారీ ఇరాన్ రాజధాని సమీపంలోని వంతెనలు, విద్యుత్ ప్లాంట్లపై అమెరికా బాంబు దాడులు చేసి వాటిని ధ్వంసం చేస్తామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరాన్‌పై అమెరికా చర్యలు ఇంకా ముగియలేదని, ప్రస్తుతం దాడులు ఆగిపోయినా యుద్ధం వల్ల ఏర్పడిన నష్టాల నుంచి కోలుకుని దేశ పునర్నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ఇరాన్‌కు 20 సంవత్సరాలకు పైగా సమయం పట్టే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## హర్మూజ్‌లో దాడులు చేస్తే.. ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ ప్లాంట్లే లక్ష్యం

**నౌకలపై ప్రతి దాడికి గట్టి ప్రతీకారం తప్పదు అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

**వాషింగ్టన్ :** హర్మూజ్ జలసంధిలో ప్రయాణించే నౌకలపై ఇరాన్ దాడులకు పాల్పడితే ఆ దేశంలోని కీలక మౌలిక వసతులే అమెరికా లక్ష్యంగా మారుతాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిలోని నౌకలపై ఇరాన్ కాల్పులు జరిపిన ప్రతిసారి ఆ దేశ రాజధాని సమీపంలోని వంతెనలు లేదా విద్యుత్ ప్లాంట్లపై అమెరికా దాడి చేసి వాటిని ధ్వంసం చేస్తుందని స్పష్టం చేశారు. ఇరాన్ డ్రోన్లతో దాడి చేసినా, క్షిపణులతో దాడి చేసినా తమ ప్రతిస్పందనలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రతి దాడికి కచ్చితంగా ప్రతీకారం ఉంటుందని పేర్కొన్నారు. ఇరాన్‌పై అమెరికా చర్యలు ఇంకా పూర్తిగా ముగియలేదని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం దాడులు నిలిపివేసినా యుద్ధం వల్ల ఏర్పడిన నష్టాల నుంచి కోలుకుని దేశ పునర్నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ఇరాన్‌కు 20 సంవత్సరాలకు పైగా సమయం పట్టే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.



# దమ్ముంటే నీట్‌పై చర్చకు రావాలి

**విపక్షాలకు బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్**

**న్యూఢిల్లీ :** దేశంలో ప్రకంపనలు పుట్టిస్తోన్న నీట్ పరీక్ష వ్యవహారం, పేపర్ లీక్‌ల అంశంపై పార్లమెంట్ వేదికగా ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విపక్షాలకు సవాల్ విసిరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు విపక్ష టమి పార్లమెంట్‌లో చర్చకు రాకుండా పారిపోతోందని, సభ ముందుకు వస్తే వారి 'ద్వంద్వ నీతి' బయట పడుతుందనే భయంతోనే వెనకడుగు వేస్తున్నారని నితిన్ నబిన్ ఆరోపించారు. పేపర్ లీక్ దోషులకు కఠిన శిక్షలు ఖరారు చేసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టులు' ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన అనంతరం రాహుల్ గాంధీ తీవ్ర విమర్శల నేపథ్యంలో బీజేపీ అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన నితిన్ నబిన్ ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించి ప్రతి అంశంపైనా లోక్‌సభలో చర్చించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉంది. ఔఇఇ÷ సహా ఏ అంశంపైనైనా చర్చకు మేము సిద్ధం, మీరు సిద్ధమా? పార్లమెంట్ వేదికగా చర్చకు రావాలని రాహుల్ గాంధీకి సవాల్ విసురుతున్నాం' అని ఆయన అన్నారు. 'రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం అంతా పారిపోవడమే. దాదాపు 50–60 ఏళ్లుగా యువతను వంచించడం, రెచ్చగొట్టడం, దారి మళ్లించడమే కాంగ్రెస్ చరిత్ర. అందు సభలో చర్చకు వస్తే తమ రంగు బయట పడుతుందని భయపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. విపక్షాలు యువతను వలం నిరసనకారులుగా, 'రాళ్లు విసిరేవారిగా' మాత్రమే చూశాయని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యువతకు సురక్షితమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తును అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# నీట్‌పై విద్యార్థుల ఆక్రందన సబబే

- దానికి సానులంగా స్పందించాల్సిందే
- ప్రభుత్వ విధానాలను తూర్పారా బట్టిన కమల్ హాసన్



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల ఆందోళనలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. 'ఒక బిడ్డ ఏడ్చినప్పుడే మనం వినాల్సింది. కానీ ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. నేర్చుకోవడం స్థానంలో శిక్షణ, జిజ్ఞాస స్థానంలో ఆందోళన, ప్రతిభ స్థానంలో నేర ప్రవృత్తి చోటుచేసుకుంది. ఇది కుళ్లిపోయిన వ్యవస్థ' అని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు సమాధానాలు, అవకాశాలు అందించాల్సిన వ్యవస్థ వారిని అడ్డంకులు, ఒత్తిళ్లు, నిరాశల వైపు నెట్టివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పిల్లలకు సమాధానాల బదులుగా అడ్డంకులు, లాఠీలు ఎదురైతే అది ఒక దేశ వైఫల్యానికి సంతం' అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త, విద్యా సంస్కరణల కోసం పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి కమల్ హాసన్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. 'దేశానికి రాబోయే ప్రయాణంలో మీ అవసరం ఉంది. దయచేసి మీ నిరాహార దీక్షను విరమించండి' అంటూ కోరారు.అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన భావోద్వేగ సందేశం ఇచ్చారు. 'భారతదేశ బిడ్డలారా.. మీరే మాలో ఉత్తములు. మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇప్పుడు దేశం మీకు తన కర్తవ్యాన్ని నెరవేర్చాల్సిన సమయం వచ్చింది. మీ కలలు ఎల్లప్పుడూ మా వైఫల్యాల కన్నా ఉన్నతంగా నిలవాలి' అని పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నీట్ వ్యతిరేక నిరసనలకు రాజకీయ, సామాజిక వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు, విద్యావిధానం, ప్రవేశ పరీక్షలపై జాతీయ స్థాయిలో చర్చ మళ్లీ వేడెక్కుతోంది.

## ఏఐతో ఆర్థిక సంక్షోభం ముప్పు..

# మరో రెండేళ్లు కీలకం

- ప్రముఖ బ్రిటిష్ జర్నలిస్టు రాబర్ట్ పెస్టన్
- భారీగా ఉద్యోగాల కోతలు తప్పవని హెచ్చరిక



**లండన్ :** కరోనా మహమ్మారి, 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి హెచ్చరించిన ప్రముఖ బ్రిటిష్ జర్నలిస్టు రాబర్ట్ పెస్టన్ తాజాగా కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంపై మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ సాంకేతికత మానవాళికి తీవ్రమైన సవాళ్లు తీసుకురావడంతో పాటు రాబోయే ఒకటి నుంచి రెండేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని హెచ్చరించారు. గతంలో తన హెచ్చరికలను కొందరు భయపెట్టే వ్యాఖ్యలుగా కొట్టిపారేసినా, అనంతరం అవే నిజమయ్యాయని గుర్తు చేశారు. తన తాజా పుస్తకం 'ది కిల్ స్విచ్'లో ఏఐ విస్తరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా భారీ సంఖ్యలో ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఏఐ మౌలిక సదుపాయాల కోసం డేటా సెంటర్లు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాలపై అపారమైన పెట్టుబడులు మళ్లించబడుతుండటంతో ఇతర రంగాల్లో పెట్టుబడులు తగ్గి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుందని విశ్లేషించారు. ఉద్యోగాలు కోల్పోయి ప్రజలు ఉపాధి లేకుండా పోతే ప్రభుత్వాలు ఆదాయపు పన్నుపై ఆధారపడకుండా ప్రజా సేవలను కొనసాగించే ప్రత్యామ్నాయ విధానాలను ఇప్పటి నుంచే పరిశీలించాలని సూచించారు. 2007లో బ్యాంకింగ్ రంగంలోని లోపాలపై తాను చేసిన హెచ్చరికలను అప్పట్లో చాలామంది పట్టించుకోలేదని, అనంతరం ప్రపంచ ఆర్థిక సంక్షోభం వాటి నిజానిజాలను నిరూపిం చిందని చెప్పారు. అలాగే 2009–10లో చైనాలో పర్యటించిన అనుభవాల ఆధారంగా 2019 చివర్లో కొత్త వైరస్ వ్యాప్తి ప్రమాదంపై ప్రభుత్వ వర్గాలను అప్రమత్తం చేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

# అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులు

**పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ, ఎంక్యూ–9 డ్రోన్ హ్యాంగర్, థాడ్ రాడార్‌ను ధ్వంసం చేశాం**

**టెహ్రాన్ :** అమెరికా సైనిక స్థావరాలపై ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయని ఇరాన్ ప్రకటించింది. తాజాగా కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని నిర్వహించిన దాడుల్లో పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ, ఎంక్యూ–9 డ్రోన్ డిపో, థాడ్ రాడార్ వ్యవస్థలను ధ్వంసం చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. అమెరికా వరుస దాడులకు ప్రతీకారంగానే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. జోర్డాన్‌లో ఉన్న అమెరికా థాడ్ క్షిపణి రక్షణ వ్యవస్థను అత్యంత వేగంగా ధ్వంసం చేసినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. పేట్రియాట్ రక్షణ వ్యవస్థతో పాటు సీ–రామ్ రాడార్‌ను కూడా లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేసినట్లు తెలిపింది. హెలికాప్టర్ల మరమ్మతులు నిర్వహించే భారీ పరికరాల గిడ్డంగిని కూడా ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. ఆపరేషన్ లైట్నింగ్ పేరుతో కొనసాగుతున్న దాడుల్లో కువైట్‌లోని మూడు అమెరికా సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని ఇరాన్ సైన్యం పేర్కొంది. అలాగే దోహా బేస్‌లోని ఆయుధ సామగ్రి, లాజిస్టిక్స్ డిపోలను తమ డ్రోన్లు పేల్చివేసినట్లు ప్రకటించింది. కువైట్‌లోని అలీ అల్ సలీం ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకున్న దాడిలో అక్కడ ఏర్పాటు చేసిన పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థతో పాటు ఎంక్యూ–9 డ్రోన్ల హ్యాంగర్‌ను కూడా ధ్వంసం చేసినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది.



# భారత్‌లో జేపీ మోర్గాన్ భారీ నియామకాలు

- వెయ్యి టెక్ ఉద్యోగాలకు గ్రీన్‌సిగ్నల్
- ఏఐ ప్రభావంతో ఉద్యోగాలు తగ్గినా టెక్ నిపుణులకు భారీ అవకాశాలు
- 2029 నాటికి ముంబైలో ఆసియాలోనే అతిపెద్ద జీసీసీ ఏర్పాటు లక్ష్యం




**న్యూఢిల్లీ :** ఏఐ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ, అమెరికాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ జేపీ మోర్గాన్ భారత్‌లో వెయ్యి మంది టెక్నాలజీ నిపుణులను నియమించేందుకు సిద్ధమైంది. దేశంలోని పలు నగరాల్లో ఏర్పాటు చేసిన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) కోసం ఈ నియామకాలు చేపట్టనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇటీవల జేపీ మోర్గాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జేమీ డైమన్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఏఐ వినియోగం పెరగడంతో సిబ్బంది అవసరం 30 నుంచి 40 శాతం వరకు తగ్గిందని పేర్కొన్నప్పటికీ, ఇంజినీరింగ్, ఏఐ ఆధారిత సేవలు, డేటా టెక్నాలజీ రంగాల్లో నిపుణుల అవసరం మాత్రం నిరంతరం ఉంటుందని ఈ నియామకాల ద్వారా స్పష్టమవుతోంది. జీసీసీల్లో క్లౌడ్ ఆర్కిటెక్చర్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ డేటా పైప్‌లైన్లు వంటి విభాగాల్లో నియామకాలు చేపట్టనుండగా, అభ్యర్థులకు హ్యాకర్‌ర్యాంక్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు. కోడింగ్ సామర్థ్యం, డేటా స్ట్రక్చర్లు, అల్గారిథమ్స్, సిస్టమ్ ఆర్కిటెక్చర్‌పై అభ్యర్థుల నైపుణ్యాలను పరీక్షించి ఎంపిక చేయనున్నారు. దేశీయ, అంతర్జాతీయ టెక్నాలజీ అవసరాలను తీర్చడంతో పాటు సంస్థ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంలో ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయని జేపీ మోర్గాన్ భావిస్తోంది. ప్రస్తుతం బెంగళూరు, హైదరాబాద్, ముంబై సహా దేశంలోని ఐదు నగరాల్లో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, జీసీసీల ద్వారా సుమారు 55 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. 2029 నాటికి ముంబైలో సుమారు 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసియాలోనే అతిపెద్ద జీసీసీని ఏర్పాటు చేయాలని సంస్థ ప్రణాళిక రూపొందించింది. ఈ కేంద్రం ద్వారా దాదాపు 30 వేల మంది టెక్నాలజీ, ఆపరేషన్స్ నిపుణులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# మహారాష్ట్రలో విషాదం

**వీధి కుక్కల దాడిలో మూడేళ్ల బాలుడు మృతి**

**ప్రజానావ, ముంబై:** ఛత్రపతి సంభాజీనగర్ జిల్లా ఖుల్తాబాద్‌లో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. వీధిలో ఆడుకుంటున్న మూడేళ్ల సార్థక్ పాటిల్‌పై ఎనిమిది వీధి కుక్కలు దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుక్కల దాడిలో బాలుడి శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి తల్లి మూగ, చెవిటి కావడంతో అతని ఆర్తనాదాలు ఆమెకు వినిపించలేదు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని, ఆగ్రహాన్ని రేకెత్తించింది. వీధి కుక్కల సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# కోచింగ్ సెంటర్లకు దాసోహంగా నీట్

- వెంటనే రద్దు చేసి, రాష్ట్రాల బాధ్యతలు ఇవ్వాలి
- కేంద్రం తన వైఖరిని పున:సమీక్షించుకోవాలి
- విద్యార్థుల ఆందోళనకు మద్దతు పలికిన మాజీ సీఎం స్టాలిన్

**చెన్నై :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎం అధినేత ఎం స్టాలిన్ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. నీట్ పరీక్షను నిలిపివేయడమే విద్యార్థుల సమస్యలకు ఏకైక పరిష్కారమని పేర్కొన్నారు. 'రాష్ట్రాలను నమ్మండి.. నీట్‌ను రద్దు చేయండి' అని డిమాండ్ చేశారు. నీట్ ప్రవేశపెట్టిన మూడు ప్రధాన లక్ష్యాల్లో నూ ఈ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని స్టాలిన్ ఆరో పించారు. విద్యలో సమాన అవకాశాలు కల్పించ డం, పారదర్శకత పెంచడం, నాణ్యమైన విద్యను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలు సాధించడంలో నీట్ విఫలమైందని విమర్శించారు. పాఠశాల విద్యా వ్యవస్థను బలహీ నపరిచి, కోచింగ్ సెంటర్ల ఆధిపత్యాన్ని పెంచే పరిస్థితిని నీట్ తీసుకువచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆవేదన, ఆందోళనలు కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని స్టాలిన్ వ్యాఖ్యానించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తన వైఖరిని పున:సమీక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. సామాజిక న్యాయాన్ని పరిరక్షించాలంటే నీట్ రద్దు అత్యవసరమని స్పష్టం చేశారు. గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల విద్యా ర్థులకు నీట్ అన్యాయం చేస్తోందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్టాలిన్ స్పష్టం చేశారు.

# యువతను డ్రగ్స్ కేసుల్లో ఇరికిస్తామని బెదిరించిన పోలీసు సస్పెండ్

**కాంగ్రెస్, రాజ్ థాకరే విమర్శల తర్వాత ముంబై పోలీసుల చర్య**



**ప్రజానావ, ముంబై:** యువకులను తప్పుడు డ్రగ్స్ కేసుల్లో ఇరికిస్తామని బెదిరించిన ఓ పోలీసు అధికారికి సంబంధించిన వీడియో వైరల్ కావడంతో ముంబై పోలీసులు అతడిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీతో పాటు మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్ థాకరే తీవ్ర విమర్శలు చేయడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్, సీనియర్ నేతలు విజయ్ వడెట్టివార్, వర్షా గైక్వాడ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలో, ఓ పోలీసు అధికారి క్రొంతమంది యువకులను బెదిరిస్తూ కనిపించాడు. మళ్లీ ఇక్కడికి వస్తే నీ జేబులో 50 గ్రాముల డ్రగ్స్ పెట్టి జైలుకు పంపిస్తాను అని హెచ్చరించడం వీడియోలో స్పష్టంగా వినిపించింది. దీనికి యువకుడు భయంతో ఇకపై అక్కడికి రానని చెప్పిన దృశ్యాలు కూడా ఉన్నాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముంబై పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. యువతను రక్షించాల్సిన పోలీసులే తప్పుడు కేసులతో బెదిరించడం ఆందోళనకరమని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేసే ప్రయత్న మిదేనని హర్షవర్ధన్ సప్కల్ మండిపడ్డారు. ఈ ఘటనపై స్పందించిన ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ థాకరే కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలను బెదిరించే పోలీసులు మాదకద్రవ్యాల సరఫరాదారులా? అంటూ ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని వ్యాఖ్యానించారు. వీడియోపై అంతర్గత విచారణ చేపట్టిన ముంబై పోలీసులు, అందులో కనిపించిన పోలీసు సిబ్బంది పవన్ సంగల్‌ను సస్పెండ్ చేశారు. అతను సియోన్ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని ముంబై పోలీసులు వెల్లడించారు.



# సింధుకు నిరాశ

- నాలుగు మ్యాచ్ పాయింట్లు వృథా
- చైనా ఓపెన్ రెండో రౌండ్‌లోనే నిష్క్రమణ

**చాంగ్‌జౌ:** గత వారం జపాన్ ఓపెన్ టైటిల్‌తో సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ స్థాయిలో మళ్లీ విజయాన్ని అందుకున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. ఆ జోరును చైనా ఓపెన్‌లో కొనసాగించలేకపోయింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యుఫై (చైనా) చేతిలో పోరాడి ఓడిపోయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. గంటకు పైగా సాగిన ఉత్కంఠభరిత పోరులో సింధు 21–16, 20–22, 18–21 తేడాతో పరాజయం పాలైంది. తొలి గేమ్‌లో ఒక దశలో 7–13తో వెనుకబడినా అద్భుతంగా పుంజుకుని 16–16తో సమం చేసింది. అనంతరం వరుసగా ఐదు పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లోనూ సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 20–16తో ఆధిక్యంలో నిలిచి మ్యాచ్ ముగించడానికి నాలుగు మ్యాచ్ పాయింట్లు కూడా దక్కించుకుంది. అయితే చెన్ యుఫై అసాధారణ పోరాట పటిమతో వరుసగా ఆరు పాయింట్లు గెలిచి గేమ్‌ను 22–20తో సొంతం చేసుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లోనూ ఇద్దరు ఆటగాళ్లు హోరాహోరీగా తలపడ్డారు. 17–17 వరకు స్కోరు సమంగా సాగినా, చివరి దశలో చెన్ యుఫై వరుస పాయింట్లు సాధించి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కూడా కైవసం చేసుకుంది. దీంతో మంచి పోరాటం చేసినప్పటికీ కీలక సమయంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక సింధు రెండో రౌండ్‌లోనే టోర్నీకి వీడ్కోలు పలికింది. గత వారం జపాన్ ఓపెన్ టైటిల్‌తో అభిమానులను అలరించిన సింధుకు చైనా ఓపెన్‌లో మాత్రం నిరాశే ఎదురైంది.

# భారత్‌కు తొలి పతకం ఖాయం

**సెమీస్‌కు లవ్లీనా.. కనీసం కాంస్యం ఖరారు**

**గ్లాస్గో:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ ఖాతాలో తొలి పతకం ఖాయమైంది. మహిళల 75 కేజీల బాక్సింగ్ విభాగంలో స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహెయిన్ నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధించి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఐదుగురు బాక్సర్లు మాత్రమే ఉండటంతో డ్రాలో ఆమెకు బై లభించింది. దీంతో ఒక్క పోటీ కూడా ఆడకుండానే సెమీస్‌కు చేరి భారత్‌కు తొలి పతకాన్ని ఖాయం చేసింది. జులై 31న జరిగే సెమీ ఫైనల్లో తువాలుకు చెందిన టీకేబీపీ తాఫాకీతో లవ్లీనా తలపడనుంది. ఈ పోరులో విజయం సాధిస్తే ఆమె స్వర్ణ పతక పోరుకు అర్హత సాధిస్తుంది. కామన్వెల్త్ క్రీడల్లో లవ్లీనాకు ఇది తొలి పతకం కావడం విశేషం. అస్సాంకు చెందిన లవ్లీనా ఇప్పటికే అంతర్జాతీయ వేదికపై ఎన్నో ఘన విజయాలు సాధించింది. టోక్యో ఒలింపిక్స్–2020లో 69 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలిచిన ఆమె.. 2023 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 75 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించింది.



# విజృంభించిన వైభవ్

- భారత్ ఘన విజయం
- 15 ఏళ్ల కుర్రాడి రికార్డు అర్ధశతకం
- మయాంక్ పేస్‌కు జింబాబ్వే విలవిల
- తొలి టీ20లో 7 వికెట్ల తేడాతో టీమ్ఇండియా విజయం

**హరారే:** జింబాబ్వే పర్యటనను టీమ్ఇండియా ఘన విజయంతో ఆరంభించింది. గురువారం జరిగిన తొలి టీ20లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు 7 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తుగా ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేను భారత బౌలర్లు కట్టడి చేయడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులకే పరిమితమైంది. అనంతరం 126 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 13.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1–0 ఆధిక్యం సాధించింది. భారత్ విజయానికి 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ప్రధాన కారణమయ్యాడు. ఇంగ్లాండ్ పర్యటనలో ఆశించిన స్థాయిలో రాణించలేక విమర్శలు ఎదుర్కొన్న వైభవ్.. జింబాబ్వే గడ్డపై మాత్రం తన అసలు సత్తా చూపించాడు. ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగిన అతడు కేవలం 18 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేశాడు. మొత్తంగా 19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 50 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతడి దూకుడైన ఆటతో మ్యాచ్ పూర్తిగా భారత్‌వైపు మళ్లిపోయింది.వైభవ్ తన ఇన్నింగ్స్‌తో మరో అరుదైన ఘనతను కూడా అందుకున్నాడు. 15 ఏళ్ల 118 రోజుల వయసులో అంతర్జాతీయ పురుషుల క్రికెట్లో అర్ధశతకం సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో నేపాల్‌కు చెందిన కుశాల్ మల్లా పేరిట ఉన్న పాత రికార్డును అధిగమించాడు. వైభవ్‌కు ఇషాన్ కిషన్ చక్కటి సహకారం అందించాడు. 24 బంతుల్లో 35 పరుగులు చేసిన ఇషాన్ కీలక సమయంలో వేగంగా ఆడగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 28 పరుగులతో నాటౌట్‌గా నిలిచి విజయాన్ని ఖాయం చేశాడు. తిలక్ వర్మ 6 పరుగులతో అజేయంగా నిలిచాడు. లక్ష్యం చిన్నదే కావడంతో భారత్‌కు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. అంతకుముందు భారత బౌలర్లు కూడా అద్భుత ప్రదర్శన కనబర్చారు. గాయంతో కొంతకాలం దూరమైన మయాంక్ యాదవ్ పునరాగమన మ్యాచ్‌లోనే తన వేగంతో జింబాబ్వే బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. మ్యాచ్ తొలి బంతికే బ్రయాన్ బెనెట్‌ను ఔట్ చేసిన మయాంక్, మరో వికెట్ కూడా తీసుకుని 4 ఓవర్లలో కేవలం 18 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. అతడికి ప్రిన్స్ యాదవ్ (2/19) చక్కటి సహకారం అందించగా, శివమ్ దూబె, రవి బిష్ణోయ్ తలో వికెట్ తీశారు. జింబాబ్వే బ్యాటింగ్‌లో వెస్లీ మధెవెరె ఒక్కరే కొంత ప్రతిఘటన చూపించాడు. 39 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన అతడు మరుమనితో కలిసి ఆరో వికెట్‌కు విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. మరుమని 27 పరుగులతో నాటౌట్‌గా నిలిచినా, మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో జింబాబ్వే 125 పరుగులకే పరిమితమైంది. బౌలింగ్‌లోనూ, బ్యాటింగ్ లోనూ పూర్తి ఆధిపత్యం చెలాయించిన భారత్ తొలి మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించింది. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ మెరుపు అర్ధశతకం, మయాంక్ యాదవ్ వేగవంతమైన బౌలింగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్భుత ప్రదర్శన చేసిన మయాంక్ యాదవ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఇప్పుడు రెండో టీ20లోనూ విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో భారత్ బరిలోకి దిగనుంది.



# సహాయ సిబ్బందిపై లిశా దాస్ ఆవేదన

**క్రీడాధికారులకు లేఖ..**

**కోచ్, సిబ్బందిపై స్పష్టత కోరిన పారా సైక్లిస్ట్**

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ క్రీడలకు ముందు సహాయ సిబ్బంది నియామకంలో జాప్యం, ప్రయాణ ఏర్పాట్లపై అనిశ్చితి తనకు తీవ్ర మానసిక వేదన కలిగిస్తున్నాయని భారత పారా సైక్లిస్ట్ లిశా దాస్ ఆవేదన వ్యక్తం చేసింది. గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక పారా సైక్లిస్ట్ అయిన 16 ఏళ్ల లిశా.. ఈ అంశంపై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), భారత సైక్లింగ్ సమాఖ్య (సీఎఫ్ఐ), భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ), కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖలకు లేఖ రాసింది. తన వ్యక్తిగత కోచ్ ఆదిత్య మెహతా, మహిళా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఆశా షేక్, అనుభవజ్ఞుడైన పారా సైక్లింగ్ టెక్నీషియన్‌ను సహాయ సిబ్బందిగా అనుమతించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదని లేఖలో పేర్కొంది. మే 15 నుంచి ఈ విషయమై నిరంతరం అధికారులను సంప్రదిస్తున్నా స్పందన లేకపోవడం నిరాశ కలిగించిందని తెలిపింది.



# డోప్ పరీక్షలో పట్టుబడ్డ జుడోకా



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌కు ముందు భారత జుడో జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. డోప్ పరీక్షలో విఫలమైన జుడోకా అరుణ్ కుమార్ (73 కేజీలు) గ్లాస్గో కామన్వెల్త్ క్రీడలకు దూరమయ్యా డు. పోటీలు లేని సమయంలో నిర్వహించిన డోపింగ్ పరీక్షల్లో అతడు నిషిద్ధ ఉత్ప్రేరకాలు వాడినట్లు తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) అతనిపై తాత్కాలిక నిషేధం విధించింది. గత నెలలో కిండావో గ్రాండ్ ప్రిలో పాల్గొన్న అరుణ్‌కు సస్పెన్షన్ నోటిఫికేషన్ అందిందని, దీంతో అతడిని కామన్వెల్త్ క్రీడల జట్టు నుంచి తప్పించాల్సి వస్తోందని జాతీయ జుడో సమాఖ్య వర్గాలు వెల్లడించాయి. జుడో పోటీలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానుండగా, భారత జుడో బృందం ఈ నెల 27న గ్లాస్గోకు బయలుదేర నుంది. ఇదిలా ఉండగా, భారత పారా స్విమ్మర్ తేజాస్ నందకుమార్‌కు కూడా కామన్వెల్త్ గేమ్స్‌లో అవకాశం దక్కలేదు. అర్హత ప్రమాణాలను అందుకో లేకపోవడంతో అతడిని కూడా భారత జట్టు నుంచి తప్పించారు.

Business
బిజినెస్

# నాలుగో రోజూ నష్టాల్లోనే ముగిసిన స్టాక్ మార్కెట్లు

- సెన్సెక్స్ 364 పాయింట్లు, నిఫ్టీ 127 పాయింట్లు పతనం
- మదుపర్ల సంపదలో రూ.3 లక్షల కోట్ల క్షీణత
- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, పెరిగిన క్రూడాయిల్ ధరల ప్రభావం



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజు నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరల పెరుగుదల మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఫార్మా, ఐటీ, బ్యాంకింగ్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. దీంతో బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3 లక్షల కోట్లు తగ్గి రూ.477 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 76,515.10 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై, ఇంట్రాడేలో 76,151.98 పాయింట్ల కనిష్ఠాన్ని తాకింది. చివరకు 363.66 పాయింట్లు కోల్పోయి 76,391.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 126.65 పాయింట్లు పడిపోయి 23,869.60 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.57గా నమోదైంది. సెన్సెక్స్–30లో ఆదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోగా.. మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 97.95 డాలర్ల వద్ద, బంగారం ఔన్సు ధర 4,088.87 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఏఐ ఎఫెక్ట్.. అమెజాన్, ఉబర్‌లో మళ్లీ లేఆఫ్‌లు

- టెక్ కంపెనీల్లో కొనసాగుతున్న ఉద్యోగాల కోత
- అమెజాన్‌లో ఏజీఐ విభాగం, ఉబర్‌లో కస్టమర్ సర్వీస్ ఉద్యోగులపై ప్రభావం




**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విస్తరణతో టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగుల కోత కొనసాగుతోంది. తాజాగా అమెరికాకు చెందిన అమెజాన్, ఉబర్ సంస్థలు లేఆఫ్‌లను ప్రకటించాయి. ఉబర్ తన కస్టమర్ సర్వీస్ విభాగంలో 10 శాతం ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వెల్లడించగా, అమెజాన్ ఎంతమందిని తొలగిస్తున్నదనే వివరాలు వెల్లడించలేదు. కొద్ది నెలల క్రితం సుమారు 16 వేల మంది ఉద్యోగులను తొలగించిన అమెజాన్.. ఈసారి ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) విభాగంలో ఉద్యోగాల కోతకు దిగింది. వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని సంస్థ తెలిపింది. మరోవైపు ఉబర్ కస్టమర్ సర్వీస్ ప్రక్రియను మరింత సమర్థవంతంగా మార్చేందుకు 10 శాతం సిబ్బందిని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. తొలగించిన ఉద్యోగుల స్థానంలో ఏఐ ఆధారిత కస్టమర్ సపోర్ట్‌ను వినియోగించనున్నట్లు వెల్లడించింది.

# గూగుల్‌కు ఈయూ భారీ షాక్

- రూ.9,655 కోట్ల జరిమానా
- పోటీ చట్టాల ఉల్లంఘనపై 890 మిలియన్ యూరోల ఫైన్
- సెర్చ్, ప్లే స్టోర్ ఆధిపత్య దుర్వినియోగమే కారణమని వెల్లడి
- ఈయూ నిర్ణయంపై గూగుల్ అసంతృప్తి




**కాలిఫోర్నియా:** అమెరికా టెక్ దిగ్గజం గూగుల్‌పై యూరోపియన్ యూనియన్ (ఈయూ) యాంటీట్రస్ట్ రెగ్యులేటర్ 890 మిలియన్ యూరోల (సుమారు 1 బిలియన్ డాలర్లు/ రూ.9,655 కోట్లు) భారీ జరిమానా విధించింది. సెర్చ్ ఇంజిన్, ప్లే స్టోర్‌లో తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేసి పోటీదారులను అణచివేస్తోందని పేర్కొంది. గూగుల్ తన సెర్చ్ ఫలితాల్లో షాపింగ్, హోటల్స్, రవాణా, క్రీడలు వంటి సొంత సేవలకు అధిక ప్రాధాన్యం కల్పించడం ద్వారా డిజిటల్ మార్కెట్ల చట్టాన్ని ఉల్లంఘించిందని పేర్కొంటూ 460 మిలియన్ యూరోలు జరిమానా విధించింది. అలాగే, థర్డ్‌పార్టీ యాప్ డెవలపర్లు ప్రత్యర్థుల చౌకైన సబ్‌స్క్రిప్షన్ ఆఫర్లను వినియోగదారులకు చూపకుండా పరిమితం చేసినందుకు మరో 430 మిలియన్ యూరోలు ఫైన్ విధించింది.

**నాణ్యతను తగ్గించకూడదు..**

ఈ నిర్ణయంపై గూగుల్ స్పందిస్తూ, నియంత్రణలు ఉత్పత్తులను మెరుగుపరచాల్సిందే గానీ నాణ్యతను తగ్గించకూడదని పేర్కొంది. నిబంధనల కారణంగా యూరోపియన్ వినియోగదారులు ఇష్టపడే హోటల్స్, విమానాలు, రెస్టారెంట్లకు సంబంధించిన రియల్‌టైమ్ సెర్చ్ ఫలితాలను కూడా తొలగించాల్సి వస్తోందని తెలిపింది. గత రెండు దశాబ్దాల్లో గూగుల్‌పై ఈయూ విధించిన మొత్తం జరిమానాలు 10.38 బిలియన్ యూరోలను దాటాయి.



# చమురు నిల్వల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- రూ.14,527 కోట్లతో రెండో దశ ప్రాజెక్టు
- పీపీపీ విధానంలో నిర్మాణం.. 65 లక్షల టన్నుల అదనపు నిల్వ

**న్యూఢిల్లీ:** దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందు కు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మక చమురు నిల్వల రెండో దశ విస్తరణను చేపట్టనుంది. రూ.14,527 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అమలు చేయనున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి లోక్‌సభలో తెలిపారు. ప్రాజెక్టు వ్యయంలో గరిష్ఠంగా 60 శాతం వరకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను కేంద్ర ప్రభుత్వం అందించనుంది. 2021 జులైలో ఆమోదం పొందిన ఈ రెండో దశ ప్రాజెక్టు ద్వారా అదనంగా 65 లక్షల టన్నుల ముడి చమురును నిల్వ చేసే సామర్థ్యం ఏర్పడనుంది. ఒడిశాలోని చండీఖోల్‌లో 40 లక్షల టన్నులు, కర్ణాటకలోని పదూర్‌లో 25 లక్షల టన్నుల సామర్థ్యంతో కొత్త భూగర్భ నిల్వ కేంద్రాలను నిర్మించనున్నారు. ఇప్పటికే మొదటి దశలో ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్ లిమిటెడ్ (ఐఎస్‌పీఆర్ఎల్) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కర్ణాటకలోని మంగళూరు, పదూర్‌లలో మొత్తం 53.3 లక్షల టన్నుల సామర్థ్యంతో భూగర్భ చమురు నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ కేంద్రాల విస్తరణకు ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రత్యేక కేటాయింపులు చేయలేదు. మంగళూరులోని 7.5 లక్షల టన్నుల సామర్థ్యం గల భూగర్భ గుహ వినియోగం కోసం యూఏఈకి చెందిన అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఏడీఎన్ఓసీ)తో ఐఎస్‌పీఆర్ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. అంతర్జాతీయంగా యుద్ధాలు, సరఫరా అంతరాయాలు లేదా చమురు ధరల్లో భారీ హెచ్చుతగ్గులు చోటుచేసుకున్నప్పుడు దేశానికి ఇంధన కొరత రాకుండా ఈ వ్యూహాత్మక నిల్వలు కీలకంగా ఉపయోగ పడతాయి. అలాగే చమురు దిగుమతుల్లో వైవిధ్యం పెంచే క్రమంలో భారత్ దిగుమతి దేశాల సంఖ్యను 27 నుంచి 41కు పెంచినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# ఇన్ఫోసిస్ కొత్త సీఈఓగా ఆశిష్ కుమార్ దాస్

- 2027 ఏప్రిల్ 1 నుంచి బాధ్యతలు
- అప్పటివరకు సలీల్ పరేఖ్ కొనసాగింపు
- నిర్ణయాన్ని ప్రకటించిన బోర్డు



**బెంగళూరు:** దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ కొత్త సీఈఓగా ఆశిష్ కుమార్ దాస్‌ను నియమించింది. కంపెనీ బోర్డు తీసుకున్న ఈ నిర్ణయం 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుతం సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న సలీల్ పరేఖ్ 2027 మార్చి 31 వరకు బాధ్యతలు నిర్వర్తిస్తారు. 2018లో ఇన్ఫోసిస్‌లో చేరిన ఆయన, సంస్థ చరిత్రలో అత్యధిక కాలం సేవలందించిన నాన్–ఫౌండర్ సీఈఓగా నిలవనున్నారు. ఐటీ పరిశ్రమ వేగంగా మారుతున్న నేపథ్యంలో సంస్థ విలువలను కాపాడుతూ, వినియోగదారుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే నాయకత్వం అవసరమని భావించి ఆశిష్ కుమార్ దాస్‌ను ఎంపిక చేసినట్లు ఇన్ఫోసిస్ బోర్డు ఛైర్మన్ నందన్ నీలేకని తెలిపారు. గత తొమ్మిదేళ్లుగా సంస్థకు విశేష సేవలందించిన సలీల్ పరేఖ్‌కు బోర్డు తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఈ ఏడాది చివర్లో వేతనాల పెంపు

- అక్టోబర్–జనవరి మధ్య మూడు దశల్లో అమలు
- 20వేల మంది ఫ్రెషర్ల నియామకానికి కట్టుబాటు: ఇన్ఫోసిస్
- తొలి త్రైమాసికంలో రూ.7,769 కోట్ల నికర లాభం

**బెంగళూరు:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ ఈ ఏడాది చివర్లో ఉద్యోగుల వేతనాలను పెంచనున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ నుంచి జనవరి మధ్య మూడు దశల్లో వేతనాల పెంపు అమలు చేస్తామని సంస్థ సీఈఓ సలీల్ పరేఖ్ తెలిపారు. అధిక శాతం ఉద్యోగులకు అక్టోబర్‌లో, సీనియర్ ఉద్యోగులకు జనవరిలో వేతనాల పెంపు వర్తిస్తుందని చెప్పారు. అయితే పెంపు శాతాన్ని వెల్లడించలేదు. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 4 వేల మంది ఫ్రెషర్లను నియమించుకున్న ఇన్ఫోసిస్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో క్యాంపస్ నియామకాల ద్వారా మొత్తం 20 వేల మంది ఫ్రెషర్లను తీసుకోనున్నట్లు వెల్లడించింది. సమీక్షా త్రైమాసికం ముగిసే నాటికి సంస్థలో 3.28 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, అట్రిషన్ రేటు 13 శాతంగా నమోదైంది. ఇదే త్రైమాసికంలో ఇన్ఫోసిస్ రూ.7,769 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే లాభం 12.3 శాతం పెరగగా, క్రితం త్రైమాసికంతో పోలిస్తే 8.6 శాతం తగ్గింది. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 14 శాతం వృద్ధితో రూ.48,211 కోట్లకు చేరింది.



# సీఎం విజయ్‌కు మరో మాస్ మూవీ



తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ నటించిన తాజా చిత్రం జన నాయకుడు (తమిళంలో జన నాయగన్) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హెచ్. వినోద్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ మాస్ యాక్షన్ ఎమోషనల్ డ్రామాలో పూజా హెగ్డే కథానాయికగా నటించగా, మమితా బైజు, బాబీ డియోల్, ప్రకాశ్‌రాజ్, ప్రియమణి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం విజయ్ నటనతో మెప్పించినప్పటికీ, కథనం, స్క్రీన్‌ప్లే విషయంలో మిశ్రమ స్పందనను అందుకుంది. కథ విషయానికి వస్తే.. వెట్రి కొండాన్ అలియాస్ చిచ్చా (విజయ్) కొన్ని కారణాలతో జైలు జీవితం గడుపుతుంటాడు. తల్లిని చూసేందుకు అవకాశం కల్పించిన ఓ పోలీసు అధికారి ఉద్యోగం కోల్పోవడంతో అతని కుటుంబానికి అండగా నిలుస్తాడు. ఆ అధికారి కుమార్తె విజ్జి (మమితా బైజు) బాధ్యతను తీసుకుని ఆమెను ఆర్మీ అధికారి చేయాలని సంకల్పిస్తాడు. మరోవైపు జాన్ హిమ్లర్ (బాబీ డియోల్), రాజకీయ నాయకుడు రోజా రంగసామి (ప్రకాశ్ రాజ్)తో చిచ్చాకు ఉన్న అనుబంధం, వారితో జరిగే సంఘర్షణ చుట్టూ కథ సాగుతుంది. సినిమాకు ప్రధాన బలం విజయ్ నటనే. యాక్షన్, ఎమోషనల్ సన్నివేశాల్లో ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను ఆకట్టుకుంటుంది. మాస్ ఎలివేషన్ సీన్లు, యాక్షన్ ఎపిసోడ్లలో విజయ్ తనదైన శైలిలో మెప్పించాడు. బాబీ డియోల్ విలన్ పాత్రలో హుందాగా కనిపించగా, మమితా బైజు భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో మంచి నటన కనబరిచింది. పూజా హెగ్డే, ప్రకాశ్ రాజ్, సునీల్, ప్రియమణి తదితరులు తమ పాత్రల పరిధిలో ఆకట్టుకున్నారు.

అయితే కథనమే సినిమాకు ప్రధాన బలహీనతగా మారింది. ముఖ్యంగా తొలి భాగంలో కొన్ని సన్నివేశాలు, ద్వితీయార్థంలో ఎక్కువ భాగం నెమ్మదిగా సాగడం ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది. విజయ్–విలన్ మధ్య సంఘర్షణను మరింత బలంగా చూపించాల్సిన అవసరం కనిపిస్తుంది. క్లైమాక్స్ మినహా మిగిలిన భాగాల్లో ఉత్కంఠను కొనసాగించడంలో దర్శకుడు పూర్తిగా విజయవంతం కాలేకపోయారు. సాంకేతికంగా సినిమా ఉన్నత స్థాయిలో నిలిచింది. సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రఫీ విజువల్స్‌కు బలం చేకూర్చగా, అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రభావవంతంగా నిలిచాయి. నిర్మాణ విలువలు కూడా భారీ స్థాయిలో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా సినిమా విడుదలైన వెంటనే సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున చర్చ ప్రారంభమైంది. దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలుపుతూ, విజయ్ సినీ ప్రయాణంలో ఈ చిత్రం మరో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పలువురు నెటిజన్లు తొలి భాగాన్ని పూర్తి స్థాయి మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా అభివర్ణించారు. విజయ్ స్క్రీన్ ప్రెజెన్స్, యాక్షన్, ఎమోషన్, డ్యాన్స్, కామెడీతో సినిమాను ఒంటిచేత్తో ముందుకు నడిపించారని ప్రశంసించారు. ముఖ్యంగా ఇంట్రో సీన్, దళపతి కచేరి పాట, ఇంటర్వెల్ బ్లాక్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పించాయని వ్యాఖ్యానించారు. అనిరుధ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, ముఖ్యంగా రావణ దా థీమ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచిందని కొనియాడారు.

అయితే మరోవైపు కొందరు ప్రేక్షకులు తొలి భాగం సగటు స్థాయిలోనే ఉందని అభిప్రాయపడ్డారు. ఇంటర్వెల్ ఎపిసోడ్ మినహా కథనం పెద్దగా ఆకట్టుకోలేదని, బాబీ డియోల్ విలన్ పాత్రకు మరింత బలం అవసరమని పేర్కొన్నారు. విజువల్ ఎఫెక్ట్స్ ఆశించిన స్థాయిలో లేవని, తండ్రి–కూతురు భావోద్వేగాలు పూర్తిగా కనెక్ట్ కాలేదని విమర్శించారు. అయినప్పటికీ విజయ్ నటన, అనిరుధ్ సంగీతం సినిమాను నిలబెట్టాయని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. మరో విశేషం ఏమిటంటే చిత్రంలోని విజయ్ టైటిల్ కార్డు కూడా ప్రత్యేక చర్చకు దారి తీసింది. లియో తరహా విజువల్ స్టైల్‌లో రూపొందించిన ఈ టైటిల్ కార్డులో తమిళనాడు అసెంబ్లీలో విజయ్ చేసిన వైరల్ హ్యాండ్ గెశ్చర్‌ను ఉపయోగించారు. అంతేకాకుండా సాధారణ హీరో పేరుకు బదులుగా "Honourable Chief Minister of Tamil Nadu C. Joseph Vijay" అనే ప్రత్యేక టైటిల్‌ను ప్రదర్శించడం అభిమానులను ఉత్సాహపరిచింది. దీనిని విజయ్ రాజకీయ ప్రస్థానానికి గౌరవ సూచకంగా అభిమానులు అభివర్ణిస్తుండగా, ముఖ్యమంత్రి హోదాను సినిమా టైటిల్ కార్డులో ఉపయోగించడంపై కొందరు రాజకీయ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. తొలి షోల నుంచే ఈ టైటిల్ కార్డు వీడియోలు వైరల్ అవుతూ సినిమాకు అదనపు ప్రచారం తీసుకొచ్చాయి.

మొత్తంగా చూస్తే 'జన నాయకుడులో విజయ్ నటన, యాక్షన్ ఎపిసోడ్లు, సాంకేతిక నాణ్యత ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. అయితే బలహీనమైన కథనం, నెమ్మదైన స్క్రీన్‌ప్లే, భావోద్వేగాల ప్రభావం పూర్తిస్థాయిలో పండకపోవడం సినిమాకు ప్రతికూలంగా మారాయి. విజయ్ అభిమానులకు మాత్రం మాస్ మూమెంట్స్‌తో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం నచ్చే అవకాశం ఉండగా, సాధారణ ప్రేక్షకులకు మాత్రం మిశ్రమ అనుభూతిని మిగుల్చే చిత్రంగా నిలుస్తోంది.



## అవమానాలే విజయానికి పునాది

బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా తన సినీ ప్రయాణంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను మరోసారి గుర్తు చేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో పలుమార్లు అవమానాలు ఎదుర్కొన్నానని, కొందరి వ్యక్తిగత అభిప్రాయాలు, స్వార్థపూరిత నిర్ణయాల కారణంగా తనకు వచ్చిన అవకాశాలు చేజారిపోయాయని ఆమె వెల్లడించారు. ఓ ప్రముఖ హాలీవుడ్ పాడ్ కాస్ట్‌లో మాట్లాడిన ప్రియాంక, పరిశ్రమలో అందరినీ మెప్పించలేకపోయాననే కారణంతో కొన్ని సినిమాల నుంచి తనను తప్పించారని చెప్పారు. 2007లో ఓ భారీ ప్రాజెక్ట్‌కు హీరోయిన్‌గా ఎంపికైనప్పటికీ, ఆ చిత్రంలోని హీరో తనను వద్దనడంతో ఒక్క క్షణంలోనే తన స్థానంలో మరో నటిని తీసుకున్నారని తెలిపారు. 'నిన్ను పొరపాటున ఎంపిక చేశారు.. ఈ సినిమా మరో హీరోయిన్ చేస్తుంది, మనం ఇంకో సినిమాలో కలిసి పనిచేద్దాం' అని ఆ హీరో తన ముందే చెప్పారని గుర్తు చేసుకున్నారు. అలాంటి సంఘటనలు ఎన్నో ఎదురైనా వెనక్కి తగ్గలేదని, స్టార్ హీరోల ఇగో, కొందరి స్వార్థంతో అవకాశాలు కోల్పోయినా తనపై నమ్మకం కోల్పోలేదని చెప్పారు. నటనపైనే దృష్టి పెట్టి నిరంతరం కష్టపడటమే తన విజయానికి కారణమైందని, ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా పరిశ్రమలోకి వచ్చి కుట్రలు, అవమానాలను ఎదుర్కొంటూ ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇదిలా ఉండగా, ప్రియాంక చోప్రా ప్రస్తుతం దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న మహేష్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న వారణాసి చిత్రంలో మందాకిని పాత్ర లో నటిస్తున్నారు. ఈ సినిమాతో ఆమె మరోసారి భారతీయ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.

## నేతలతో పనిచేస్తే పదవులు ఖాయం

బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్ ప్రస్తుతం దక్షిణాది చిత్రాల్లో వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. తాజాగా ఆయన ప్రతినాయకుడిగా నటించిన 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రాగా, సినిమా ప్రమోషన్ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనతో కలిసి పనిచేసిన హీరోలంతా రాజకీయాల్లో ఉన్నత పదవులు దక్కించుకున్నారని సరదాగా అన్నారు. ప్రచారం విషయంలో తాను, విజయ్ ఇద్దరూ ఒకేలా ఆలోచిస్తామని బాబీ దేవోల్ తెలిపారు. అధిక ప్రచారాల కంటే చేసే పనితోనే గుర్తింపు రావాలని విజయ్ నమ్ముతారని, తన అభిప్రాయం కూడా అదే అని చెప్పారు. నటుడి పనితీరే మాట్లాడాలని తాము విశ్వసిస్తామని పేర్కొన్నారు.

## రామాయణలో సీత పాత్రపై సోషల్ మీడియాలో చర్చ

బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం రామాయణ విడుదలకు ముందే చర్చనీయాంశంగా మారింది. రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్న ఈ చిత్రంలోని కాస్టింగ్‌పై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సీత పాత్రకు సాయిపల్లవిని ఎంపిక చేయడాన్ని కొందరు నెటిజన్లు విమర్శిస్తూ, పాత్రకు మరింత అనువైన లుక్ ఉన్న నటిని ఎంపిక చేయాల్సిందని అభిప్రాయపడుతున్నారు. ఇటీవల విడుదలైన ఇతర పాత్రల పోస్టర్లలో శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, మండోదరిగా కాజల్ అగర్వాల్ ఆకట్టుకోవడంతో, ప్రధాన పాత్ర అయిన సీత కంటే సహాయ పాత్రల్లో నటించినవారే మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నారంటూ సోషల్ మీడియాలో పోస్టులు, మీమ్స్ వైరల్ అవుతున్నాయి. సీత పాత్రకు దివ్యమైన రూపం అవసరమని, ఆ లుక్ సాయిపల్లవిలో కనిపించడం లేదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు సాయిపల్లవి అభిమానులు ఈ విమర్శలను ఖండిస్తున్నారు. సీత పాత్రకు కేవలం బాహ్య సౌందర్యం మాత్రమే కాకుండా పవిత్రత, ప్రశాంతత, భావోద్వేగాలను హృద్యంగా ఆవిష్కరించే నటన అత్యంత



ముఖ్యమని, ఆ లక్షణాలన్నీ సాయిపల్లవిలో ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. పాత్రల మధ్య ఉండే రూప భేదాలే కథకు మరింత బలం చేకూరుస్తాయని కూడా అభిప్రాయపడుతున్నారు. ట్రైలర్ విడుదలయ్యాకే సాయిపల్లవి లుక్, పాత్రపై స్పష్టమైన అభిప్రాయం ఏర్పడుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. జూలై 24న విడుదల కానున్న ట్రైలర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## గబ్బర్ సింగ్ రమేష్‌కు బ్రెయిన్ స్ట్రోక్

టాలీవుడ్ నటుడు, 'గబ్బర్ సింగ్' చిత్రంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గబ్బర్ సింగ్ రమేష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆకస్మికంగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. రమేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుండగా, న్యూరాలజీ విభాగానికి చెందిన వైద్య బృందం ఆయనకు ప్రత్యేక చికిత్స అందిస్తోంది. ఈ వార్తతో టాలీవుడ్‌లో ఆందోళన నెలకొంది. 'గబ్బర్ సింగ్' చిత్రంలో తన ప్రత్యేక నటన, హావభావాలతో ప్రేక్షకుల మన్ననలు పొందిన రమేష్, ఆ తర్వాత పలు చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపు సంపాదించారు. ఇటీవల విడుదలైన 'ఉస్తాద్ భగత్ సింగ్'లోనూ ఆయన కనిపించారు. రమేష్ త్వరగా కోలుకుని మళ్లీ సాధారణ జీవితంలోకి రావాలని సినీ ప్రముఖులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు.

## విశ్వనాథం అండ్ సన్స్ నుంచి కొత్త లుక్ విడుదల



కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ అభిమాన వర్గం ఉంది. ఇటీవల విడుదలైన 'వీరభద్రుడు' సినిమాతో మాస్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాపై ఇప్పటి భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన కొత్త పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారా యి. ముఖ్యంగా బ్రౌన్ కలర్ సూట్‌లో సూర్య కనిపించిన స్టైలిష్ లుక్ అభిమానులను ఎంతగానో ఆకట్టు కుంటోంది. చాలా కాలం తర్వాత సూర్యను ఇలాంటి క్లాస్, వింటేజ్ స్టైల్‌లో చూడటం ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన ఆనందాన్ని కలిగిస్తోంది. ఈ పోస్టర్లతో సినిమాపై మరింత హైప్ పెంచిన మేకర్స్ మరో సర్‌ప్రైజ్ డా ప్రకటించారు. ఇప్పటి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి స్పందన రావడంతో, ఈ కొత్త పాటపై డా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం కుటుంబ భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలను కలగలిపిన కథతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది.

## బన్నీతో మూడోసారి పూజాహెగ్డే?



టాలీవుడ్‌లో మరోసారి అగ్ర కథానాయికగా తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు పూజాహెగ్డే గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల దక్షిణాది చిత్రాలతో పాటు బాలీవుడ్‌లోనూ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ అందాల భామ, ఇప్పుడు మరో భారీ తెలుగు చిత్రాన్ని కూడా ఖాతాలో వేసుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఓ తెలుగు చిత్రంలో నటిస్తున్న పూజాహెగ్డే, శర్వానంద్ హీరోగా రూపొందనున్న 'జార్జ్‌క్రిష్' చిత్రంలో కూడా కథానాయికగా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో మరోసారి జోడీ కట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఫిల్మ్‌నగర్‌లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'రాకా'లో నటిస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే దర్శకుడు లోకేష్ కనకరాజ్‌తో ఆయన చేయనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన ఇప్పటికే విడుదల కాగా, ఇందులో కథానాయికగా పూజాహెగ్డే పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. చిత్రబృందం ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, ఈ కాంబినేషన్ దాదాపు ఖరారైందనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అల్లు అర్జున్, పూజాహెగ్డే జంట ఇప్పటికే 'డీజే (దువ్వాడ జగన్నాథం)', 'అల వైకుంఠపురములో' వంటి విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా 'అల వైకుంఠపురములో' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడంతో పాటు ఈ జోడీకి మంచి క్రేజ్‌ను తీసుకొచ్చింది. దీంతో మరోసారి వీరిద్దరూ కలిసి నటించనున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. లోకేష్ కనకరాజ్ శైలిలో తెరకెక్కనున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో పూజాహెగ్డే పాత్రకు కూడా మంచి ప్రాధాన్యం ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తలపై పూర్తి స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277